తొలివార్త

RNI : TGTEL/25/A0357

ప్రజా గళం మా కలం.....

www.tolivaartha.com

తెలుగు దిన పత్రిక

www.epaper.tolivaartha.com

best deal HEALTH & WEALTH

"అవకాశాలను సృష్టించడం, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడం."

We create opportunities | 9640707117 (What's up only)

ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్ సంపుటి : 02 సంచిక : 203 ఆదివారం 29 - 11 - 2026 వెల : 4/- పేజీలు : 08

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial

డీలిమిటేషన్ బిల్లుకు

బీఆర్ఎస్ మద్దతు

- తెలంగాణ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం
- దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకూడదు
- పార్లమెంట్‌లో 24 శాతం వాటా కొనసాగించాలి
- లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు పెరిగే అవకాశం
- 2051 వరకు అంతర్రాష్ట్ర ప్రాతినిధ్య నిష్పత్తికి రక్షణ
- తెలంగాణకు అన్యాయం జరిగితే సహించేది లేదు
- లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు పెరిగే అవకాశం



తొలివార్త, హైదరాబాద్, నవంబర్ 28 :

డీలిమిటేషన్ బిల్లుపై బీఆర్ఎస్ వైఖరిని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు తెలుపుతూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. తెలంగాణ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. డీలిమిటేషన్ బిల్లుకు రాజ్యసభలో బీఆర్ఎస్ సభ్యులు అనుకూలంగా ఓటు వేస్తారన్నారు. డీలిమిటేషన్‌పై తమ వైఖరి ఎప్పుడూ స్పష్టంగానే ఉందని చెప్పుకొచ్చారు. పార్లమెంట్‌లో దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గకూడదన్నారు. తెలంగాణకు అన్యాయం జరిగితే సహించేదిలేదని స్పష్టం చేశారు.పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాలకు ప్రస్తుతం ఉన్న 24శాతం ప్రాతినిధ్య వాటా కొనగించాలని తాము మొదటి - మిగతా 2 లో

కాంగ్రెస్ సీనియర్ నేత

జగ్గారెడ్డి ఇంటికి హరీశ్ రావు



- జగ్గారెడ్డి నివాసానికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించిన హరీశ్ రావు
- సుమారు 21 ఏళ్ల తర్వాత తొలిసారి ఫ్యామిలీ ఫంక్షన్‌లో కలిసిన నేతలు
- 2004లో హరీశ్ చాంబర్‌లోనే భోజనం చేసేవాళ్లమని గుర్తుచేసుకున్న జగ్గారెడ్డి
- కూతురి పెళ్లికి పిలవలేకపోయా.. కుమారుడి వేడుకకు పిలిచానన్న కాంగ్రెస్ నేత
- తమ భేటీ వెనుక ఎలాంటి రాజకీయాలు, అంతరార్థాలు లేవని స్పష్టీకరణ

తొలివార్త, హైదరాబాద్, నవంబర్ 28 :

తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సంగారెడ్డిలోని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి నివాసానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ అగ్రనేత తన్నీరు హరీశ్ రావు విచ్చేశారు. జగ్గారెడ్డి కుమారుడు భరత్ సాయిరెడ్డి, కోడలు - మిగతా 2 లో



డీలిమిటేషన్‌పై బీజేపీ, బీఆర్ఎస్‌ల

మధ్య చీకటి ఒప్పందం

- ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్
- డీలిమిటేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతివ్వడంపై అద్దంకి దయాకర్ ఆగ్రహం
- దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యం తగ్గించేందుకే బీజేపీ కుట్ర అని విమర్శ
- ఈ అంశంపై మౌనంగా ఉండేందుకు బీఆర్ఎస్ అమ్ముడుపోయిందని ఫైర్

తొలివార్త, హైదరాబాద్, నవంబర్ 28 :

దక్షిణ భారతదేశ రాజకీయ ప్రయోజనాలకు నష్టం కలిగించే డీలిమిటేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు ఇవ్వడం వెనుక బీజేపీతో కుదిరిన చీకటి ఒప్పందమే కారణమని ప్రభుత్వ - మిగతా 2 లో

ఎట్టకేలకు తిరుప్పరంకుండ్రం దీపత్తూన్ వద్ద వెలిగిన కార్తీక దీపం

- సుప్రీంకోర్టు ఆదేశాలతో తిరుప్పరంకుండ్రంలో కార్తీక దీపోత్సవం
- కొండపై ఉన్న ప్రాచీన రాతి స్తంభంపై దీపం వెలిగించిన అర్చకులు
- దర్గా చుట్టూ 50 మీటర్ల బఫర్ జోన్ మరియు సీఆర్‌పీఎఫ్ భద్రత
- కొండపైకి 50 మంది భక్తులకు మాత్రమే అనుమతి
- కోర్టు ధిక్కార హెచ్చరికలతో చర్యలు చేపట్టిన తమిళనాడు యంత్రాంగం



మహిళా రిజర్వేషన్ల అమలును

ఏ పార్టీ కూడా అడ్డుకోలేదు



- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- లిమిటేషన్-మహిళా రిజర్వేషన్ బిల్లును ఈనెల 30న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ప్రధాని స్పందించారు
- దేశంలోని 'నారీ శక్తి'కి ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడింది

తొలివార్త, ఢిల్లీ, నవంబర్ 28 :

లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేసి తీరుతామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న పార్టీలు దాన్ని ఎన్నటికీ అడ్డుకోలేవని తేల్చిచెప్పారు. పార్లమెంట్ ముందు డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులు - మిగతా 2 లో

లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం

రూ.75 లక్షల ఆర్థిక సాయం



- లొంగిపోయిన 18 మంది మావోయిస్టులకు ఏపీ ప్రభుత్వం రూ.75 లక్షల ఆర్థిక సాయం అందజేత
- రాష్ట్ర కమిటీ సభ్యుడు జోరిగ నాగరాజుకు రూ.20 లక్షల సహాయం
- త్వరలోనే మరో 32 మంది మావోయిస్టులకు రూ. 1.21 కోట్ల సాయం పంపిణీ
- గత రెండున్నరేళ్లలో 18 మంది మావోయిస్టులు మృతి.. 73 మంది అరెస్ట్

తొలివార్త, అమరావతి, నవంబర్ 28 :

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌ను నక్సల్ రహితంగా రాష్ట్రంగా తీర్చిదిద్దామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. - మిగతా 2 లో



వందే భారత్‌లో వడలో భారీ లోహపు బోల్టు

- స్పందించిన ఐఆర్‌సీటీసీ
- వందే భారత్ రైలులో వడ్డించిన వడలో పెద్ద ఐ మెటల్ బోల్ట్ గుర్తింపు
- బెంగళూరు నుంచి బెళగావి వెళుతున్న ప్రయాణికుడికి చేదు అనుభవం
- ప్రయాణికుడికి క్షమాపణలు చెప్పిన ఐఆర్‌సీటీసీ యాజమాన్యం
- వందే భారత్ ఆహార నాణ్యతపై నెట్టింట నెటిజన్ల తీవ్ర ఆగ్రహం

తొలివార్త, ఢిల్లీ, నవంబర్ 28 :

బెంగళూరు నుంచి బెళగావి వెళుతున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికుడికి చేదు అనుభవం ఎదురైంది. అల్పాహారంలో వడ్డించిన వడ లోపల ఏకంగా పెద్ద మెటల్ - మిగతా 2 లో

తెలుగు రాష్ట్రాల్లో భారీగా తగ్గిన చికెన్, గుడ్ల ధరలు

- కార్తిక మాసం ఎఫెక్ట్‌తో భారీగా తగ్గిన చికెన్ ధరలు
- కిలో చికెన్‌పై దాదాపు 50 రూపాయల మేర తగ్గుదల
- మార్కెట్లో పడిపోయిన కోడిగుడ్ల విక్రయాలు, రేట్లు
- సరఫరా పెరిగి డిమాండ్ తగ్గడమే ధరల పతనానికి కారణం
- వచ్చే నెలలో మళ్లీ పెరిగే అవకాశం ఉందంటున్న వ్యాపారులు



న్యాయవ్యవస్థలో 'లీగల్ ఏఐ సాక్'

- సీఎం చంద్రబాబు కీలక ప్రకటన
- రాజమండ్రిలో జిల్లా కోర్టు, బార్ అసోసియేషన్ వేడుకల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- వచ్చే ఏడాది పోలవరం పూర్తి.. గోదావరి పుష్కరాలకు న్యాయమూర్తులకు ఆహ్వానం
- అమరావతిని కాపాడిన జస్టిస్ మిశ్రాను ప్రత్యేకంగా అభినందించిన సీఎం
- 2047 నాటికి దేశం వికసిత్ భారత్, ఏపీ స్వర్ణాంధ్రగా మారుతుందని ధీమా



తొలివార్త, అమరావతి, నవంబర్ 28 :

సీఎం చంద్రబాబు నాయుడు రాజమహేంద్రవరంలో పర్యటించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఈరోజు రాజమహేంద్రవరంలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా కోర్టు ఏర్పడి 222 ఏళ్లు పూర్తవడం, రాజమండ్రి బార్ అసోసియేషన్ 131 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలోనే కాకుండా న్యాయవ్యవస్థలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, 'లీగల్ ఏఐ స్టాక్'ను త్వరలోనే అమలు చేస్తామని ప్రకటించారు.తాటి ఆకులపై తీర్పుల నుంచి నేటి - మిగతా 2 లో

ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతంగా పెరగనున్న ఉద్యోగావకాశాలు

- రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్
- రామాయపట్నం రిఫైనరీకి బీపీసీఎల్ ఆమోదం
- రామాయపట్నం బీపీసీఎల్ రిఫైనరీ ఆమోదంపై మంత్రి నారా లోకేశ్ హర్షం
- సుమారు రూ.1.27 లక్షల కోట్ల భారీ అంచనా వ్యయంతో ప్రాజెక్ట్ ఏర్పాటు
- దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతంగా పెరగనున్న ఉద్యోగావకాశాలు
- వార్షికంగా 9 మిలియన్ మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్ ప్రాసెసింగ్ సామర్థ్యం
- 2032 జూలై నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ప్రాజెక్ట్



తొలివార్త, అమరావతి, నవంబర్ 28 :

ఆంధ్రప్రదేశ్‌లోని రామాయపట్నంలో అత్యాధునిక రిఫైనరీ ఏర్పాటుకు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) బోర్డు ఆమోదం తెలపడంపై రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంతో పాటు రిఫైనింగ్ సామర్థ్యాన్ని విస్తరించడంలో 9 ఎంఎంటీపీఏ - మిగతా 2 లో

తొలివార్త
RNI : TGTEL/25/A0357
www.tolivaartha.com
www.epaper.tolivaartha.com

సంపాదకీయం

మళ్లీ ట్రంప్ సుంకాల బాణం



అంతర్జాతీయంగా ఛీత్కారాలు ఎదురైనా, స్వదేశంలో న్యాయస్థానాలు కాదన్నా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలను వేధించటానికే నిశ్చయించు కున్నట్టు కనబడుతోంది. తాజాగా అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్ ఇచ్చిన నివేదిక (యూఎస్‌టీఆర్) మన దేశంతోపాటు చైనా, జపాన్ తదితర 14 దేశాలపై అదనపు సుంకాలు విధించాలని సిఫార్సు చేసింది. వచ్చే ఏడాది అమలయ్యే ఈ సిఫార్సుల్లో మన దేశానికే కాస్త వెసులుబాటు దొరికినట్టు. కానీ దానికో మెలికవుంది. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరితే 17 శాతం సుంకాలు, లేనట్టయితే 25 శాతంపెంచాలని నివేదిక సిఫార్సు చేసింది.మొన్నీమధ్యే ట్రంప్ చైనాలోని షెన్‌జెన్ పోయి చైనా, రష్యా అధినేతలతో త్రైపాక్షిక సమావేశం జరిపారు. ప్రపంచానికి ఒరిగిందేమీ పెద్దగా లేకపోయినా, కనీసం వాళ్ల ముగ్గురిమధ్యా ఏదో మేర అవగాహన కుదిరిందన్న అభిప్రాయం కలిగింది. కానీ పదిరోజులు దాటకుండానే ట్రంప్ సుంకాల అస్త్రం బయటికి తీశారు. గత అదనపు సుంకాలు చెల్లబోవని అక్కడి సుప్రీంకోర్టు తీర్పునిచ్చాక మొన్న మార్చిలో యూఎస్‌టీఆర్ ప్రక్రియ మొదలైందంటేనే ట్రంప్ దురుద్దేశం అర్థమవుతుంది. ఈసారి సాకు చిత్రమైనది. ఇప్పుడు సుంకాలు విధించబోయే దేశాలన్నీ మార్కెట్ డిమాండ్‌కు మించి సరుకుల్ని ఉత్పత్తి చేయగల సామర్థ్యంలో ఉన్నాయట! అందుకని యూఎస్‌టీఆర్‌లోని సెక్షన్ 301 కింద దర్యాప్తు మొదలెట్టి ఈ నిర్ణయం తీసుకున్నారట. నివేదికను నిశితంగా పరిశీలిస్తే ఆరు ఆగ్నేయాసియా దేశాల ఆర్థిక వ్యవస్థలపైనా, చైనాపైనా అమెరికా శీతకన్నేసిందని తెలుస్తుంది. ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో ఇటీవలి ఆగ్నేయాసియా దేశాల (ఆసియాన్) శిఖరాగ్ర సదస్సుకు ట్రంప్ హాజరయ్యారు.అయినా ఆయనలో సామరస్య ధోరణి లేకపోగా, వాటివల్ల అమెరికా నష్టపోతున్నట్టు చిత్రిస్తున్నారు. అమెరికా వాలకం చూస్తే దానికి నిర్దిష్టమైన వ్యూహాత్మక విధానాలున్నట్టు అనిపించదు. మిత్ర దేశాలు, వాణిజ్య భాగస్వామ్య దేశాలు, దీటుగా పోటీ ఇచ్చే దేశాలు అనే విచక్షణ కనబడదు. నివేదిక చెబుతున్నట్టు నిజంగా ఇవి వచ్చే ఏడాదినుంచి అమల్లోకొస్తే, అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ముందునాటి సుంకాల్ని దాదాపు చెల్లించక తప్పని స్థితి ఏర్పడుతుంది. యూఎస్‌టీఆర్ రెండు నెలలు దర్యాప్తుచేసి, మొన్న మేలో నివేదికఇచ్చింది.కానీ దేశంలో మధ్యంతర ఎన్నికలు, మనీలా శిఖరాగ్రం, షెన్‌జెన్ త్రైపాక్షిక సమావేశం వగైరాలు ముగిశాక ఈ ప్రకటన చేయాలని ట్రంప్ నిర్ణయించుకున్నట్టున్నారు. అమెరికా ఒత్తిళ్ల కారణంగా తప్పనిసరై వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్న ఇండొ నేసియా, మలేసియా తదితర దేశాల్లో పాలకులపై జనం ఆగ్రహోదగ్రులవుతున్నారు. దేశ సార్వభౌమత్వాన్ని కుదువపెట్టారన్న విమర్శలొస్తున్నాయి. వారు దిక్కుతోచని స్థితిలోపడి తమ నిర్ణయంవల్లే అమెరికా సుంకాలు పది పన్నెండు శాతం మించలేదని సర్దిచెప్పుకుంటున్నారు. కానీ తాజా నిర్ణయం అమలైతే ఇవి ఒకేసారి 20 నుంచి 35 శాతానికి ఎగబాకుతాయి. మరి ఆ ఒప్పందాలవల్ల ఏం ప్రయోజనం ఉన్నట్టు?తన వ్యూహం బెడిసికొడుతుందని ట్రంప్ గ్రహించలేకపోతున్నారు. ఆయననిర్ణయంవల్ల అవతలి దేశానికి కలిగే నష్టం మాటేమోగానీ... సరుకుల ధరలు మరింత పెరిగి అమెరికా వ్యాపారుల, వినియోగదారుల నడ్డి విరగడం ఖాయం. బెదిరింపులు, ఒత్తిళ్ల ద్వారా వేరే దేశాలను లొంగదీసి దేశ సంపద పెంచాలని ట్రంప్ అనుకుంటేఅది తెలివితక్కువతనం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అనేది పరస్పర సహకారం, ప్రతి దేశమూ ఎదిగేందుకు తగిన వాతావరణం కల్పించడంలోనే ఉంటుంది తప్పఇలాంటి బెదిరింపులవల్ల కాదు.ఇంతకూ మన ఆత్మనిర్భర భారత్, మేకిన్ ఇండియా, ప్రధాన రంగాలకు బ్యాంకుల రుణ సదుపాయం, చైనానుంచి ముడిసరకు దిగుమతి వగైరాలవల్ల తమ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని నివేదిక అంటున్నది. ఈ వరస చూస్తుంటే ప్రపంచ దేశాలన్నీ తన మోచేతి నీళ్లు తాగి పడివుండాలని అమెరికా భావిస్తున్నట్టు కనబడుతోంది. ట్రంప్ మరో రెండేళ్ల ఏలుబడి ఎప్పుడు ముగుస్తుందాఅని ప్రపంచ దేశాలు ఎదురుచూస్తున్నాయి. ఆ తర్వాతైనా తీరు మారకపోతే అవితమ దారి తాము చూసుకుంటాయి. ఈలోగా అమెరికాకు జ్ఞానోదయమైతే దానికేమంచిది!

న్యాయవ్యవస్థలో 'లీగల్ ఏఐ స్టాక్'

మొదటిపేజీ తరువాయి - ఏఐ సాంకేతికత వరకు న్యాయవ్యవస్థ ఎంతో రూపాంతరం చెందిందన్నారు. పన్నుల వసూళ్లలో ఏఐతో మంచి ఫలితాలు సాధిస్తున్నామని, అదే స్ఫూర్తితో న్యాయపాలన, వ్యాజ్యాల నిర్వహణ కోసం 'లీగల్ ఏఐ స్టాక్' తీసుకువస్తామని వివరించారు. దీని ద్వారా జీవోలు, చట్టాలు, కేసు రికార్డులను డిజిటలైజ్ చేయడంతో పాటు ఏఐ సాయంతో కేసుల విశ్లేషణ, కౌంటర్ అఫిడవిట్ల తయారీ వంటివి సులభతరం అవుతాయని తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్ లిటిగేషన్ కేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా 8.4 లక్షల కేసులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం చారిత్రక ప్రాధాన్యతను చంద్రబాబు గుర్తుచేశారు. ఆదికవి నన్నయ్య, కందుకూరి వీరేశలింగం వంటి



మహనీయులు, బ్రిటిష్ వారికే గుండె చూపిన టంగుటూరి ప్రకాశం పంతులు, ఇక్కడే ప్రాక్టీస్ చేసి భారత 9వ ప్రధాన న్యాయమూర్తి అయిన జస్టిస్ కోకా సుబ్బారావు వంటి గొప్పవారిని ఈ ప్రాంతం అందించిందని కొనియాడారు. రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు వచ్చే ఏడాదికి పూర్తవుతుందని, త్వరలో రానున్న గోదావరి పుష్కరాలకు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను ఆయన సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా అప్పటి ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా తన తీర్పుతో అమరావతిని, రాష్ట్రాన్ని కాపాడిన జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాను, ఏపీ హైకోర్టు తొలి మహిళా న్యాయమూర్తి జస్టిస్ లీసాగిల్‌ను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజాస్వామ్యంలోని నాలుగు స్తంభాలు పటిష్ఠంగా ఉండటం వల్లే ప్రపంచ సంక్షోభంలోనూ భారత్ స్థిరంగా ఉందని, 2047 నాటికి దేశం 'వికసిత్ భారత్'గా, ఏపీ 'స్వర్ణాంధ్ర'గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతంగా పెరగనున్న ఉద్యోగావకాశాలు

మొదటిపేజీ తరువాయి - సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి, భారీగా ఉద్యోగాల కల్పనకు ఈ రిఫైనరీ ఒక ప్రధాన ఉత్ప్రేరకంగా నిలుస్తుందని లోకేశ్ స్పష్టం చేశారు. ఈ మేరకు బీపీసీఎల్ తీసుకున్న నిర్ణయాన్ని తెలియజేసే సీఎన్‌బీసీ టీవీ18 మీడియా సంస్థ కథనాన్ని ఆయన రీపోస్ట్ చేస్తూ తన అభిప్రాయాలను పంచుకున్నారు.సీఎన్‌బీసీ టీవీ18 కథనం ప్రకారం, ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీపీసీఎల్ బోర్డు శనివారం (నవంబర్ 28) సమావేశమై రామాయపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ నిర్మాణానికి లాంఛనంగా ఆమోదం తెలిపింది. దాదాపు రూ.1,26,656 కోట్ల అంచనా వ్యయంతో ఈ మెగా ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్ అమల్లోకి రావడానికి కేంద్ర క్యాబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ (సీసీఈఏ), ఇతర చట్టబద్ధమైన, నియంత్రణ సంస్థల ఆమోదాలు అవసరం కానున్నాయి.ఈ ప్రాజెక్ట్‌ను బీపీసీఎల్ తన పూర్తిస్థాయి అనుబంధ సంస్థ ద్వారా అభివృద్ధి చేయనుంది. దీని సాంకేతిక సామర్థ్యాలను పరిశీలిస్తే, ముడి చమురు శుద్ధి సామర్థ్యం ఏడాదికి 9 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉండనుంది. దీనితో పాటు 1.5 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో కూడిన మిక్స్‌డ్-ఫీడ్ ఇథిలీన్ క్రాకర్, సంబంధిత డౌన్‌స్ట్రీమ్ పెట్రోకెమికల్ యూనిట్లను ఏర్పాటు చేస్తారు. మొత్తంగా ఈ కాంప్లెక్స్ ఉత్పాదన వార్షికంగా 10.5 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉండగా, పెట్రోకెమికల్ ఇంటెన్సిటీ సుమారు 34 శాతంగా నమోదవుతుంది.ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన నిధులను ఈక్విటీ, రుణాల మిశ్రమం ద్వారా సమీకరించనున్నారు. ఈ అనుబంధ సంస్థలోకి విడతల వారీగా గరిష్ఠంగా రూ.44,330 కోట్ల వరకు ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకు బీపీసీఎల్ బోర్డు ఇప్పటికే సూత్రప్రాయ అనుమతి ఇచ్చింది. ఇందులో గతంలో ఆమోదించిన రూ.4,900 కోట్ల భాగస్వామ్యం కూడా కలిసి ఉంది. షెడ్యూల్ ప్రకారం, ఈ మెగా రిఫైనరీ ప్రాజెక్ట్ 2032 జూలై నాటికి వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించే లక్ష్యంతో పని చేస్తోంది.ప్రస్తుతం బీపీసీఎల్ వార్షిక రిఫైనింగ్ సామర్థ్యం 35.3 ఎంఎంటీపీఏగా ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంస్థ తన సామర్థ్యాన్ని మించి 116.6 శాతం వినియోగంతో నడిచింది. దేశీయంగా పెరుగుతున్న రవాణా ఇంధనాల కొరతను అధిగమించడంతో పాటు, పెట్రోకెమికల్స్ రంగంలో పెరుగుతున్న డిమాండ్-సరఫరా అంతరాన్ని భర్తీ చేయడంలో ఈ కొత్త ప్రాజెక్ట్ ఎంతో దోహదపడుతుంది. ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చడం ద్వారా ఏపీ పారిశ్రామిక ముఖచిత్రం గణనీయంగా మారే అవకాశం ఉంది.

మహిళా రిజర్వేషన్ల అమలును ఏ పార్టీ కూడా అడ్డుకోలేదు

మొదటిపేజీ తరువాయి -

ముందుకు రానున్న నేపథ్యంలో ఎక్స్ వేదికగా మోదీ వీడియో పోస్టు చేశారు. దేశంలోని 'నారీ శక్తి'కి ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని పునరుద్ఘాటించారు. నారీ శక్తికి సాధికారత కల్పించాలనే తమ సంకల్పం చెక్కుచెదరలేదని, మహిళా రిజర్వేషన్ల అమలుకు ఎదురయ్యే ప్రతి అడ్డంకిని కచ్చితంగా తొలగిస్తామన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇస్తున్న వారిలో ఉత్సాహం రెట్టింపుగా ఉందన్నారు. తమ ధైర్యం అజేయమని, తమ సంకల్పం దృఢమైనదని పేర్కొన్నారు. త్వరలోనే మహిళా రిజర్వేషన్ల అమల్లోకి వస్తాయని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.నారీ శక్తికి భాగస్వామ్యం కల్పించే పోరాటం దశాబ్దాలుగా సాగుతోంది. ఏళ్ల తరబడి దీనికోసం కృషి చేసిన వారిలో నేను కూడా ఒకడిని. ఎందరో మహిళలు ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకొస్తూనే ఉన్నారు. ఎందరో అక్కాచెల్లెళ్లు లేఖల ద్వారా అన్ని విషయాలు నాకు తెలిపారు. దేశంలోని వందకు వంద శాతం నారీ శక్తి ఆశీర్వాదం మాతో ఉందని నాకు తెలుసు. దేశంలోని ప్రతి మహిళకు నేను భరోసా ఇస్తున్నాను. మహిళా రిజర్వేషన్ల మార్గంలో ఎదురయ్యే ప్రతి అడ్డంకిని మేము కచ్చితంగా తొలగించి తీరుతాము. అడ్డు తొలగిస్తాము. మా ధైర్యం అజేయమైనది. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న పార్టీలు పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో దేశ నారీ భాగస్వామ్యాన్ని పెంచకుండా ఎప్పటికీ ఆపలేవు.ఇదిలా ఉండగా, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన డీలిమిటేషన్ రెండో బిల్లును పరిశీలించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లోక్‌సభకు సిఫార్సు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 117(3) ప్రకారం రాష్ట్రపతి ఈ సిఫార్సు చేశారు. ఈ మేరకు లోక్‌సభ ఓ బులెటిన్ జారీ చేసింది. ఈనెల 30నుంచి ప్రారంభం కానున్న లోక్‌సభ సమావేశాల్లో ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టనుంది. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఈ బిల్లును ప్రతిపాదించనుంది. డిసెంబర్ 2న ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టే అవకాశముంది.మరోవైపు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిబంధనల ప్రకారమే ఏర్పాటు చేసినట్లు పార్లమెంటు వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ప్రత్యేక సమావేశాల విషయంలో ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘించిందన్న ప్రతిపక్షాల ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. సభను సమావేశపరచడం రాజ్యాంగ విరుద్ధం ఎలా అవుతుందని ప్రశ్నించారు. పార్లమెంటు సమావేశాలను ప్రోరోగ్ చేయకుండానే సభను మళ్లీ నిర్వహించిన సందర్భాలు గతంలోనూ ఉన్నాయని కిరణ్ రిజిజు గుర్తుచేశారు. ఆగస్టు 13న నిరవధికంగా వాయిదాపడిన వర్షాకాల సమావేశాలను ఇంకా ప్రోరోగ్ చేయనందున, 4 రోజుల భేటీ దానికి కొనసాగింపుగానే జరుగుతుందని ఆయన వివరించారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో చాలా ముఖ్యమైన బిల్లులు చర్చకు రానున్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. సభ సజావుగా సాగేందుకు ఎంపీలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీల నేతలతో తాను ఇప్పటికే మాట్లాడినట్లు కేంద్రమంత్రి చెప్పారు. ప్రభుత్వంతో ఏకీభవించేందుకు లేదా విభేదించేందుకు సభ్యులకు పూర్తి హక్కు, స్వేచ్ఛ ఉన్నాయని తెలిపారు. నిబంధనలు, సంప్రదాయాలకు లోబడి ఎంపీలు తమ అభిప్రాయాలను వ్యక్తంచేయాలని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సూచించారు. అయితే శీతాకాల పార్లమెంటు సమావేశాలు నిర్వహిస్తారా లేదా అనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేయలేదు.

ఎట్టకేలకు తిరుప్పరంకుండ్రం దీపత్తూన్ వద్ద వెలిగిన కార్తీక దీపం

మొదటిపేజీ తరువాయి - తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న ప్రాచీన రాతి స్తంభం (దీపత్తూన్) పై శనివారం సాయంత్రం కార్తీక దీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. సుప్రీంకోర్టు జారీ చేసిన స్పష్టమైన ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది.శనివారం సాయంత్రం 5 గంటలకు ఆలయ అర్చకులు దీపోత్సవాన్ని నిర్వహించారు. కొండపై ఉన్న మండపం వద్ద అప్పటికే వెలుగుతున్న దీపం నుంచి పవిత్ర జ్యోతిని రాతి స్తంభం వద్దకు తీసుకువచ్చారు. సుమారు 30 కిలోల నెయ్యి, 50 మీటర్ల వత్తి, 5 కిలోల కర్పూరాన్ని ఉపయోగించి ఈ ప్రాచీన స్తంభంపై దీపాన్ని వెలిగించారు.ఈ కార్యక్రమానికి రిటైర్డ్ న్యాయమూర్తులు జస్టిస్ వైద్యనాథన్, జస్టిస్ పార్థిబన్, జిల్లా కలెక్టర్ నిషాంత్ కృష్ణతో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. సీఆర్‌పీఎఫ్ బలగాల పహారా నడుమ ఈ ప్రక్రియను పూర్తి చేశారు. కొండ దిగువన పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానికులు వేచి ఉన్నప్పటికీ, శాంతిభద్రతల దృష్ట్యా కొండపైకి కేవలం 50 మంది భక్తులను మాత్రమే అనుమతించారు. అంతేకాకుండా, కొండపై ఉన్న సికందర్ దర్గా చుట్టూ 50 మీటర్ల పరిధిని బఫర్ జోన్‌గా ప్రకటించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.సాధారణంగా ఏటా తిరుప్పరంకుండ్రం సుబ్రహ్మణ్య స్వామి ప్రధాన ఆలయానికి సరిగ్గా పైన ఉండే ఉచ్చిపిళ్లైయార్ ఆలయ సమీపంలోని దీప మండపంపై కార్తీక మహాదీపాన్ని వెలిగించడం సంప్రదాయంగా వస్తోంది. అయితే, అదే కొండపై సికందర్ దర్గాకు సమీపంలో ఉన్న పాత రాతి స్తంభంపై కూడా దీపం వెలిగించాలనే డిమాండ్‌పై గత కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది.గతేడాది మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఆ రాతి స్తంభంపై దీపం వెలిగించాలని ఆదేశించినప్పటికీ, అధికారులు దానిని అమలు చేయలేదు. దీంతో ఈ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ ఏడాది నవంబర్ 20న సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, రాతి స్తంభంపై దీపం వెలిగించేందుకు అనుమతి ఇచ్చింది.అయితే, కార్తీక పౌర్ణమి నాడు కేవలం ఆలయ మండపంపైనే దీపాన్ని వెలిగించి, రాతి స్తంభంపై వెలిగించకపోవడంతో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు, తమ ఆదేశాలను కావాలనే ఉల్లంఘించారని తమిళనాడు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారాన్ని కోర్టు ధిక్కారంగా పరిగణిస్తూ, శనివారం నాటికి రాతి స్తంభంపై తప్పనిసరిగా దీపం వెలిగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను అనుసరిస్తూ తమిళనాడు అధికారులు చర్యలు చేపట్టడంతో, కొండపై దీపారాధన ప్రశాంతంగా ముగిసింది.

తెలుగు రాష్ట్రాల్లో భారీగా తగ్గిన చికెన్, గుడ్ల ధరలు

మొదటిపేజీ తరువాయి - తెలుగు రాష్ట్రాల్లో చికెన్, కోడిగుడ్ల ధరలు ఒక్కసారిగా దిగొచ్చాయి. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో వీటి ధరలు భారీగా పతనమయ్యాయి. కార్తిక మాసంతో పాటు అయ్యప్ప స్వామి, శివమాల దీక్షల కాలం కావడంతో చాలామంది మాంసాహారానికి దూరంగా ఉంటున్నారు. దీంతో మార్కెట్లో నాన్‌వెజ్ వినియోగం బాగా క్షీణించింది. మరోవైపు పౌల్ట్రీ ఫారాల నుంచి మార్కెట్‌కు సరఫరా యథావిధిగా కొనసాగుతుండటంతో డిమాండ్ లేక ధరలు వేగంగా తగ్గుముఖం పట్టాయి.ఇటీవలి వరకు కొన్ని ప్రాంతాల్లో స్కిన్‌లెస్ చికెన్ ధర కిలో రూ.300 దాటి సామాన్యులకు భారంగా మారింది. అయితే ప్రస్తుతం డిమాండ్ తగ్గడంతో కిలో చికెన్‌పై దాదాపు రూ.50 వరకు ధర తగ్గింది. చికెన్‌తో పాటే



కోడిగుడ్ల ధరలు కూడా గణనీయంగా పడిపోయాయి.హైదరాబాద్ జోన్‌లో స్కిన్‌లెస్ చికెన్ కిలో ధర రూ.252కు చేరగా, డ్రెస్డ్ చికెన్ ధర రూ.223గా ఉంది. రిటైల్ లైవ్ బర్డ్ ధర కిలో రూ.144, ఎక్స్-ఫామ్ లైవ్ బర్డ్ ధర రూ.117 వద్ద కొనసాగుతోంది. గతంలో డజన్ గుడ్ల ధర దాదాపు రూ.90 వరకు ఉండగా, ప్రస్తుతం అది రూ.74కు పడిపోయింది.విజయవాడ జోన్‌లో స్కిన్‌లెస్ చికెన్ ధర కిలో రూ.249 కాగా, డ్రెస్డ్ చికెన్ రూ.220గా ఉంది. రిటైల్ లైవ్ బర్డ్ కిలో రూ.142, ఫామ్ లైవ్ బర్డ్ ధర రూ.115 వద్ద పలుకుతున్నాయి. ఇక్కడ డజన్ గుడ్ల ధర ప్రస్తుతం రూ.80 వద్ద ఉంది.కార్తిక మాసం ముగిసే వరకు మార్కెట్లో ఇదే విధమైన పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. వచ్చే నెలలో కార్తిక మాసం ముగియడం, క్రిస్మస్ పండుగ సీజన్ ప్రారంభం కానుండటంతో మాంసాహారానికి డిమాండ్ మళ్లీ పెరిగి, ధరలు తిరిగి పుంజుకునే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం రూ.75 లక్షల ఆర్థిక సాయం

మొదటిపేజీ తరువాయి - రాజధాని అమరావతిలోని ఏపీ డీజీపీ కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో, లొంగిపోయిన 18 మంది మావోయిస్టులకు పునరావాస సహాయం కింద మొత్తం రూ. 75 లక్షల డిమాండ్ డ్రాఫ్టులను (డీడీలు) ఆయన స్వయంగా అందజేశారు.లొంగిపోయిన వారిలో మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు జోరిగ నాగరాజు అలియాస్ కమలేశ్, ఇద్దరు డివిజనల్ కమిటీ సభ్యులు, పది మంది ఏరియా కమిటీ సభ్యులు, ఐదుగురు దళ సభ్యులు ఉన్నారు. నాగరాజుకు రూ. 20 లక్షలు అందజేయగా, మిగిలిన 17 మందికి రూ. లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మొత్తం రూ. 2.87 కోట్ల రివార్డులో ఇప్పటికే రూ. 91 లక్షలు అందించామని, నేడు రూ. 75 లక్షలు ఇచ్చామని డీజీపీ చెప్పారు. లొంగిపోయిన మరో 32 మందికి రూ. 1.21 కోట్ల ఆర్థిక సహాయాన్ని త్వరలోనే అందిస్తామని స్పష్టం చేశారు.గత రెండున్నరేళ్ల కాలంలో జరిగిన ఎదురుకాల్పుల్లో 18 మంది మావోయిస్టులు మరణించారని, 73 మందిని పోలీసులు అరెస్టు చేశారని డీజీపీ వివరించారు. హింస ద్వారా ఏదీ సాధించలేమనే భావన వారిలో స్పష్టంగా కనిపిస్తోందని, ప్రధాన స్రవంతిలోకి వచ్చిన వారి జీవనోపాధిపై నిరంతరం ఆరా తీస్తున్నామని తెలిపారు.మరోవైపు మన్యం ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేశామని, సరళ్, ప్రేరణ, స్ఫూర్తి వంటి కార్యక్రమాల ద్వారా వేలాది మంది యువతకు శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఏజెన్సీలో 169 రహదారులు, 39 వంతెనల నిర్మాణం చేపట్టామని, 2,090 మొబైల్ టవర్లతో 96 శాతం గ్రామాలకు నెట్‌వర్క్ కనెక్టివిటీ కల్పించినట్లు డీజీపీ వెల్లడించారు. సరిహద్దుల్లో నిరంతర నిఘా కొనసాగుతోందని పేర్కొన్నారు.

వందే భారత్‌లో వడలో భారీ లోహపు బోల్టు

మొదటిపేజీ తరువాయి - బోల్ట్ ప్రత్యక్షమైంది. కంగుతిన్న ప్రయాణికుడు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో రైల్వే వర్గాల్లో తీవ్ర కలకలం రేగింది. ఈ ఘటనపై ప్రయాణికులకు క్షమాపణలు చెప్పిన ఐఆర్‌సీటీసీ, సంబంధిత క్యాటరింగ్ సర్వీస్ ప్రొవైడర్‌పై కఠిన చర్యలు చేపట్టింది.సమర్థ్ కొడియాల్ అనే ప్రయాణికుడు 'ఎక్స్' వేదికగా ఈ దృశ్యాలను పంచుకున్నాడు. ప్లేటులోని వడను రెండు ముక్కలుగా చేసి, దాని లోపల ఉన్న పెద్ద బోల్ట్‌ను పక్కన పెట్టి వీడియోలో చూపించాడు. ఆహార నాణ్యతలో ఇది అత్యంత ఘోరమైన లోపమని మండిపడ్డాడు. రైల్వే శాఖ వెంటనే ఈ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. ఈ పోస్ట్ కాస్తా నెట్టింట వైరల్‌గా మారడంతో నెటిజన్లు రైల్వే ఆహార నాణ్యతపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఫిర్యాదుపై ఐఆర్‌సీటీసీ వెంటనే స్పందించింది. ప్రయాణికుడికి కలిగిన అసౌకర్యానికి విచారం వ్యక్తం చేస్తూ క్షమాపణలు కోరింది. బాధ్యులైన సర్వీస్ ప్రొవైడర్‌పై జరిమానాతో కూడిన క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. కిచెన్లలో తనిఖీలను మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించింది. మరోవైపు ఎంత టికెట్ ధర చెల్లించినా నాణ్యమైన ఆహారం లభించడం లేదని, ఆహార తయారీ కేంద్రాల్లో మెటల్ డిటెక్టర్లు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని నెటిజన్లు రైల్వే శాఖను నిలదీస్తున్నారు.

డీలిమిటేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు

మొదటిపేజీ తరువాయి - నుంచీ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. లోక్‌సభ స్థానాలకు 50 శాతం పెంచడం తోపాటూ 2051 వరకు అంతర్రాష్ట్ర ప్రాతినిధ్య నిష్పత్తి మారకుండా రక్షణ కల్పించే ప్రతిపాదన తమ ప్రధాన ఆందోళనకు పరిష్కారంగా ఉందని అన్నారు. ఈ ప్రతిపాదనలతో తెలంగాణ లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 17 నుంచి 26కు పెరుగుతాయని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లకు కూడా బీఆర్ఎస్ ఎప్పుడూ మద్దతుగా ఉందని.. దాని అమలుకు కట్టుబడి ఉన్నామని ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.



కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి ఇంటికి హరీశ్ రావు



మొదటిపేజీ తరువాయి - పాలక్ పటేల్ నిర్వహించిన సత్యనారాయణ వ్రతం సందర్భంగా వారిని ఆశీర్వదించేందుకు ఆయన నేరుగా జగ్గారెడ్డి ఇంటికి వెళ్లారు. ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న వీరిద్దరూ సుమారు 21 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒకరినొకరు కలుసుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.ఈ సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించిన అనంతరం జగ్గారెడ్డి, హరీశ్ రావులు కాసేపు ఆప్యాయంగా ముచ్చటించారు. అనంతరం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 2004లో హరీశ్ రావు తొలిసారి మంత్రిగా ఉన్నప్పుడు తాను ఆయనను కలిసి ఆయన చాంబర్‌లోనే భోజనం చేసేవాళ్లమని గుర్తుచేశారు. ఆ తర్వాత తాను కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు హరీశ్ రావును కలవలేదన్నారు. గత పదేళ్లు హరీశ్ మంత్రిగా, తాను ఎమ్మెల్యేగా కొనసాగినప్పటికీ ఎన్నడూ కలవలేకపోయానని తెలిపారు.కూతురి పెళ్లికి హరీశ్‌ను పిలవలేకపోయానని, అయితే ఈసారి కుమారుడి వేడుకను మిస్ కావద్దని ప్రత్యేకంగా ఆహ్వానించినట

బాల్యవివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి



రామన్నపేట, నవంబర్ 28 (తొలివార్త) : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బాలల హక్కులు, బాలికల భద్రతపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని వక్తలు సూచించారు. మండల న్యాయ సేవా కమిటీ రామన్నపేట వారి ఆదేశాల మేరకు శనివారం రామన్నపేటలోని డాన్ బాస్కో ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాల నిర్మూలన, బాలల హక్కులు, బాలికల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలికల రక్షణ, బాలల హక్కులు తదితర అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. బాల్యవివాహాలను అరికట్టడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిసినప్పుడు విద్యార్థులు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో పోలీసులను లేదా సంబంధిత అధికారులను సంప్రదించి న్యాయ సహాయం పొందాలని తెలిపారు. బాలికలు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఏవైనా సమస్యలు, వేధింపులు ఎదురైతే మౌనంగా ఉండకుండా పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. బాల్యవివాహాలు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు, అకాడమిక్ డైరెక్టర్ పి. జనార్దన రావు, ఉపాధ్యాయులు జి. నవీన్ కుమార్, సయ్యద్ ఖదీర్, హీన, సి.హెచ్. విజయలక్ష్మి, శ్రీదేవి, హిరణ్మయి, మత్యగిరి, భవాని, వనజాత, బి. సునీత, జోజప్ప, సుమ, మాధవి, పద్మ, శ్రీలత, రేష్మ, మహాలక్ష్మి, రమేష్ తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచ్ మర్రి సంధ్య మల్లారెడ్డి చేతుల మీదుగా

లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



భద్రాద్రి జిల్లా నవంబర్ 28 (తొలివార్త) : అశ్వాపురం మండల పరిధిలోని మొండికుంట గ్రామపంచాయతీలో శనివారం సర్పంచ్ మర్రి సంధ్య మల్లారెడ్డి చేతుల మీదుగా, మొండికుంట గ్రామంలోని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చలమల్ల శివకుమార్, కార్యదర్శి సంధ్యారాణి, పాలకవర్గ సభ్యులు రామిడి శంభారెడ్డి కొమరం.రాము జిపిఓ చిరంజీవి, లబ్ధిదారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వైద్య ఖర్చులకు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన

ఎమ్మెల్యే ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు





భద్రాద్రి జిల్లా నవంబర్ 28 (తొలివార్త) : పినపాక మండలంలోని మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్ఓ) కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అర్హులైన 31 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించగా, వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన మొత్తం రూ.9 లక్షల 80 వేల విలువైన చెక్కులను సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, ఆపద సమయంలో వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ, సంబంధిత అధికారులు, మండల అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు, బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తాలేం కళ్యాణి, ఏఎంసి వైస్ చైర్మన్ కాకా రాములు ఏఎంసీ డైరెక్టర్లు,ఆత్మా కమిటీ సభ్యులు,దిశ కమిటీ సభ్యులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మండల నాయకులు కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు మండల బీసీ సంఘం ఆధ్వర్యంలో

మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు



భద్రాద్రి జిల్లా నవంబర్ 28 (తొలివార్త) : మణుగూరు మండల కేంద్రంలోని బీసీ సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన.. మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆ మహనీయుడు చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించిన. సమితి సింగారం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ మున్నూరు కాపు సంఘ కార్యదర్శి గాండ్ల సురేష్, ఆత్మ కమిటీ చైర్మన్ ఆవుల సర్వేశ్వరరావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ కుర్రి చలపతిరావు,బీసీ సంఘ రాష్ట్ర నాయకులు సోమేష్ కుమార్ గౌడ్, ఈ కార్యక్రమంలో మండల బీసీ సంఘ నాయకులు గుండ్ల వెంకటేశ్వర్లు,ఏం చారి, బొజ్జా త్రిమూర్తులు, పొదిళ్ల వీరబాబు, ఉప్పలయ్య, ఎండి యాకూబ్ అలీ, బీసీ సంఘ మహిళా నాయకురాలు బాసెటి కవిత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతుల చిరకాల నిరీక్షణకు తెర భద్రాచలం

ప్రాంత రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా ప్రారంభించిన

ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



భద్రాద్రి జిల్లా నవంబర్ 28 (తొలివార్త) : భద్రాచలం కూనవరం రోడ్డులో తెలంగాణ ప్రభుత్వం ద్వారా రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందించే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం విద్యుత్ సరఫరా సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చే దిశగా శనివారం ఈ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడం ద్వారా వ్యవసాయ రంగానికి ఎంతో మేలు జరుగుతుందని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ విద్యుత్ శాఖ డి ఈ జీవన్ సంబంధిత అధికారులు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ధాన ధర్మ ట్రస్ట్ చైర్మన్ ఘంటా రాధ ఆధ్వర్యంలో

మావుళ్ళవాయి గుట్టబోడు గ్రామంలో

150 మంది విద్యార్థులకు పుస్తకాలు దుస్తులు పంపిణీ





అశ్వాపురం నవంబర్ 28 (తొలివార్త) : అశ్వాపురం మండల పరిధిలోని వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలోని మామిళ్లవాయి గుట్టబోడు గ్రామంలో వలస ఆదివాసీల కోసం మారుమూల ఏజెన్సీ గ్రామాలను కేంద్రంగా చేసుకొని, చుట్టుపక్కల గ్రామాల్లోని నిరుపేద కుటుంబాల పిల్లలకు విద్యా అవకాశాలు కల్పిస్తూ ఆమె,ఆదర్శంగా,నిలుస్తున్నారు.సాధారణంగా మారుమూల గ్రామాల్లో నివసించే పేద కుటుంబాల పిల్లలకు విద్యను అందించడం అనేక సవాళ్లతో కూడుకున్న విషయం. ఆర్థిక ఇబ్బందులు, సరైన విద్యా సౌకర్యాల కొరత, పుస్తకాలు, దుస్తులు కొనుగోలు చేయలేని పరిస్థితులు చిన్నారుల చదువుకు ఆటంకాలుగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితులను గుర్తించిన ఘంటా రాధ, దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా సేవలకు శ్రీకారం చుట్టి పేద విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలుస్తున్నారు. 150 మంది విద్యార్థులకు విద్యా సేవలు వెంకటాపురం, వేములూరు తదితర గ్రామాల పరిధిలోని సుమారు 150 మంది విద్యార్థినీ విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నారు. చిన్నారులకు అవసరమైన పుస్తకాలు, దుస్తులు అందించడంతో పాటు వారి చదువుకు అవసరమైన ఇతర సదుపాయాలను కూడా సమకూరుస్తున్నారు. కేవలం చదువు చెప్పించడమే కాకుండా విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి అండగా నిలవడం ఈ ట్రస్ట్ సేవల్లో ప్రత్యేకతగా నిలుస్తోంది.

విద్యతో పాటు భోజనం.. చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

చిన్నారుల చదువుతో పాటు వారి ఆరోగ్యం, పోషణ పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. విద్యార్థులకు భోజన సదుపాయాలు కల్పిస్తూ, ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా ప్రోత్సహిస్తున్నారు. చిన్నారుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించేందుకు అవసరమైన బోధనా సామగ్రి, పలకలు, పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నారు. పిల్లలు చదువుతో పాటు క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవర్చుకునేలా ప్రోత్సహించడం విశేషం. పేదరికం చదువుకు అడ్డుకాకూడదనే గొప్ప సంకల్పం,గ్రామీణ ప్రాంతాల్లోని అనేకమంది చిన్నారుల్లో ప్రతిభ ఉన్నప్పటికీ సరైన అవకాశాలు లేక వారి కలలు మధ్యలోనే ఆగిపోతున్నాయి. అలాంటి పిల్లలకు విద్యా అవకాశాలు కల్పిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగగలరనే నమ్మకంతో ఘంటా రాధ తన సేవలను కొనసాగిస్తున్నారు. తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గిస్తూ, పిల్లలు చదువుకు దూరం కాకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుతున్నారు. ప్రచార ఆర్భాటాలకు దూరంగా.. సేవా మార్గంలో ముందడుగు,సమాజంలో సంపాదించిన సంపదలో కొంత భాగాన్ని నిరుపేద పిల్లల భవిష్యత్తు కోసం వినియోగించడం ఎంతో గొప్ప విషయం. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో విద్యా సౌకర్యాలు కల్పించడం ద్వారా ఒక కుటుంబానికే కాకుండా రాబోయే తరాలకు కూడా మేలు చేసినట్లవుతుంది. ఘంటా రాధ చేస్తున్న ఈ కృషి ఇతర సేవా సంస్థలకు, దాతలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.ఒక చిన్నారి చేతిలో పుస్తకం పెట్టడం అంటే ఒక కుటుంబంలో ఆశల దీపం వెలిగించడమే. ఒక నిరుపేద విద్యార్థికి విద్యా అవకాశం కల్పించడం అంటే సమాజ భవిష్యత్తుకు పునాది వేయడమే. ఈ దిశగా దానధర్మ ట్రస్ట్ చైర్మన్ ఘంటా రాధ చేస్తున్న సేవలు ప్రశంసనీయం. ఇలాంటి సేవా కార్యక్రమాలకు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, దాతలు, విద్యావంతులు తమవంతు సహకారం అందిస్తే మరింతమంది నిరుపేద చిన్నారులకు విద్యా ఫలాలు అందే అవకాశం ఉంటుంది. చదువుతోనే జీవితాల్లో మార్పు సాధ్యమని నమ్మి.. సుమారు 150 మంది చిన్నారుల భవిష్యత్తుకు అండగా నిలుస్తున్న ఘంటా రాధ సేవా ప్రయాణం నిజంగా అభినందనీయం. మారుమూల గ్రామాల్లో విద్యా వెలుగులు విరజిమ్ముతూ ఆమె చేస్తున్న కృషి సమాజానికి ఆదర్శంగా నిలవాలని వెంకటాపురం మావుళ్ళవాయి గ్రామాల ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

భద్రాచలంలో దీక్షా దివస్ ఈనెల 29న నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

బిఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గం ఇన్చార్జి మానే రామకృష్ణ



భద్రాచలం నవంబర్ 28 (తొలివార్త) : దీక్షా దివస్ కార్యక్రమాన్ని భద్రాచలం పట్టణ కేంద్రంలో కేకే ఫంక్షన్ హాల్ నందు ఈ నెల నవంబర్ 29 తేదీన నిర్వహించనున్న,సందర్భంగా విజయవంతం చేసేందుకు భద్రాచలం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు, అభిమానులు, మహిళా నాయకురాలు యువజన నాయకులు, సమష్టిగా కృషి చేయాలని, భద్రాచలం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ మాజీ ఇంచార్జి మానే రామకృష్ణ, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన చారిత్రాత్మక దీక్షను మలుపు తెప్పిన రోజైనటువంటి ఈనెల 29న దీక్షా,దివస్,కార్యక్రమంలో,నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొనాలని మానే రామకృష్ణ కోరారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటుతూ పార్టీ శ్రేణులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలి.ప్రతి గ్రామంలోని ప్రతి గుంపు నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, అభిమానుల పేర్లు, వారి ఫోన్ నంబర్లతో కూడిన జాబితాను స్థానిక నాయకులు సిద్ధం చేసుకోవాలి. అదేవిధంగా సేకరించిన వివరాలను ఈనెల నవంబర్ 29న భద్రాచలం కేకే ఫంక్షన్ హాల్ నందు జరిగే దీక్షా దివస్ కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసే ప్రత్యేక కౌంటర్‌లో సంబంధిత నాయకులు తప్పనిసరిగా సమర్పించాలి అని ఆయన తెలిపారు. గ్రామాల వారీగా కార్యకర్తల వివరాలను ముందుగానే సిద్ధం చేసుకుని కార్యక్రమానికి హాజరయ్యేలా సమన్వయం చేసుకోవాలి అని మానే రామకృష్ణ, పేర్కొన్నారు. భద్రాచలం,నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు, గ్రామస్థాయి ముఖ్య నాయకులు తమ పరిధిలోని ప్రతి గ్రామంలో పర్యటించాలి. కార్యకర్తలు, అభిమానులను నేరుగా కలిసి దీక్షా దివస్ కార్యక్రమానికి ఆహ్వానించాలి.అని మానే రామకృష్ణ అన్నారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి, ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు భద్రాచలం తరలివచ్చేల, మాజీ మండల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు బాధ్యత తీసుకోవాలి.అని ఆయన అన్నారు. కార్యక్రమ వివరాలు,తేదీ: నవంబర్ 29, 2026 (ఆదివారం)–,వేదిక: భద్రాచలం పట్టణంలో కేకే ఫంక్షన్ హాల్ నందు,సమయం: ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు–కార్యక్రమానికి హాజరయ్యే నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికీ భోజన సదుపాయం ఏర్పాటు, చేయబడుతుంది. కావున భద్రాచలం నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమాన్ని తమ కార్యక్రమంగా భావించి ముందస్తు ఏర్పాట్లతో పెద్ద ఎత్తున తరలివచ్చి దీక్షా దివస్ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, భద్రాచలం నియోజకవర్గం మాజీ బిఆర్ఎస్, పార్టీ ఇంచార్జ్ మానే రామకృష్ణ పిలుపునిచ్చారు.

విద్యార్థులే నిజమైన దేశ సంపద.. వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి



రామన్నపేట, నవంబర్ 28 (తొలివార్త) : యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు విద్యార్థులే నిజమైన దేశ సంపద అని, విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, నైతిక విలువలు అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని రామన్నపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి డి. సత్యయ్య అన్నారు. మోత్కూర్ మండలం పాటిమట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రామన్నపేట మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిరియాల దామోదర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి డి. సత్యయ్య విద్యార్థులకు పలు చట్టాలు, బాలల హక్కులు, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు, చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని, వాటికి బానిసలై తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకొని చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అలాగే పోక్సో చట్టం, బాలల రక్షణ హక్కులు, యాసిడ్ దాడుల నివారణ, బాల్యవివాహాల నిరోధం వంటి అంశాలపై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. బాలలపై జరిగే లైంగిక వేధింపుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని తెలిపారు. ఎవరైనా వేధింపులకు పాల్పడినా, అన్యాయం జరిగినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాలల హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించి పరిరక్షించాలని పేర్కొన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది కె. శ్రీనివాస్, సహాయ ప్రభుత్వ న్యాయవాది ఎస్. శ్రవణ్ కుమార్, న్యాయవాది బి. దేవిడ్, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు కునగళ్ల మల్లేశం, న్యాయ సేవా ప్రతినిధి కురిమేటి యాదయ్య, వ్యవసాయ న్యాయ సహాయ కేంద్రం ప్రతినిధి కానుగంటి శ్రీశైలం, స్థానిక సర్పంచ్ బండ రామా విజయ్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఏఏపీసీ చైర్మన్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు, విద్యార్థులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

59 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి





భువనగిరి, నవంబర్ 28 (తొలివార్త) : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి మంజూరైన 59 ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన మంజూరు ఉత్తర్వులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష అని, ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేదల కలను నిజం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ముఖ్య ఉద్దేశమని అన్నారు. అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించి విడతల వారీగా ఇళ్ల మంజూరు ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, నిర్ణీత నిబంధనలు పాటిస్తూ నాణ్యతా ప్రమాణాలతో ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు భద్రతతో కూడిన సొంత నివాసం కల్పించడమే కాకుండా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇళ్ల మంజూరు ఉత్తర్వులు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ తమ సొంతింటి కల నెరవేరేందుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మండల, పట్టణ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహాత్మా జ్యోతిరావు పూలే

ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు



మణుగూరు నవంబర్ 28 (తొలివార్త) : మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే భారతదేశ చరిత్రలో గొప్ప సంఘ సంస్కర్తగా, సామాజిక విప్లవకారుడిగా చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న కులవివక్ష, అంటరానితనం, అసమానతలు, మూఢనమ్మకాలపై ఆయన అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు.ముఖ్యంగా మహిళలకు విద్య అందించాలనే గొప్ప సంకల్పంతో తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి బాలికల విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. అణగారిన వర్గాలు, బడుగు బలహీన వర్గాలకు విద్య, సమాన హక్కులు, ఆత్మగౌరవం కల్పించేందుకు ఆయన చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని నమ్మిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు నేటికీ ఎంతో ప్రాసంగికమని, ఆయన చూపిన బాటలో పయనిస్తూ సమానత్వం, సామాజిక న్యాయం, విద్యాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజ అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తొలేం కళ్యాణి, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు, ఆత్మా కమిటీ సభ్యులు, రాష్ట్ర నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘనంగా నివాళులర్పించారు.

చిన్న శేషయ్య ఆశయాలను సాధించే దానికి కృషి చేద్దాం తాళ్లపల్లి కృష్ణ.

కొనిజర్ల నవంబర్ 28 (తొలివార్త): చిన్న మునగాల గ్రామంలో అమరజీవి చెరుకుమల్లి చిన్న శేషయ్య 28వ వర్ధంతి సభ చింతనిప్పు నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా చిన్న శేషయ్య చిత్రపటానికి తాళ్లపల్లి కృష్ణా పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అదేవిధంగా చిన్న శేషయ్య స్థూపానికి పార్టీ మండల కార్యదర్శి చెరుకుపల్లి కుటుంబరావు పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని శాఖ కార్యదర్శి చింతనిప్పు నరసింహారావు ఎగరవేశారు. ఈ వర్ధంతి సభను ఉద్దేశించి సిపిఐఎం జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ మాట్లాడుతూ చిన్న శేషయ్య వర్ధంతి జరుపుకోవడం అత్యంత విషాదకరమైనటువంటి రోజు. ఉన్నత కుటుంబంలో జన్మించినప్పటికీ కూడా పేద ప్రజల యొక్క ఆశ ఆంక్షలు నెరవేర్చి దాని కొరకు ఎర్ర జెండా పట్టుకొని గ్రామంలో ప్రజలకు అండగా ఉంటూ భారత కమ్యూనిస్టు పార్టీను ముందుకు నడిపించారు. దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించడం అత్యంత బాధాకరమైనటువంటి విషయం. ఆయన ఏ రైతు సమస్య పైన పేద ప్రజల యొక్క అభివృద్ధి కోసం పాటుపడినారు ఆ ఆశయాలను ముందుకు తీసుకుపోయే దాని కొరకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ మండల కార్యదర్శి చెరుకుపల్లి కుటుంబరావు మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో పాలిస్తున్న పాలక ప్రభుత్వాలు ప్రజల సమస్యలను మరిచి వ్యక్తిగత స్వార్థాల కోసం రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారు. దేశంలో ఉన్నటువంటి ప్రజలను మతాల పేరట విభజించి మత రాజకీయాలను ముందుకు తీసుకుపోతున్నారు. దానివల్ల మైనారిటీలో ఉన్నటువంటి ప్రజలకు తీవ్రమైనటువంటి ఇబ్బందులను కలగజేస్తున్నారు. ప్రజల జీవన స్థితిగతులు ఉన్న శేషయ్య చనిపోయిన వాడు దేశంలో రైతులు కూలీల పరిస్థితి ఎలా ఉన్నది నేడు ఎలా ఉన్నది అన్న విషయాన్ని గనుక మనం ఒకసారి పరిశీలించినట్లయితే ఈ 28 సంవత్సరాల



కాలంలో వ్యవసాయ రంగాన్ని పాలక ప్రభుత్వాలు పూర్తిగా భ్రష్టు ప్రకటించి రైతు వ్యవసాయ రంగం నుంచి పారిపోయేలా వారి యొక్క ఉద్దేశాలు కార్పొరేటర్లకు అనుకూలంగా మరల నోట్లో మన్ను కొట్టే నటువంటి పరిస్థితిని మనం చూస్తున్నాం. ముఖ్యంగా రైతులకు సబ్సిడీలు అన్నీ ఎత్తివేసి రైతుల నడ్డి విరిసినటువంటి పరిస్థితి అత్యంత దారుణం. రసాయన ఎరువులు యూప్ ద్వారా బుక్ చేసుకుని కొనేటటువంటి దుస్థితికి వ్యవసాయ రంగాన్ని తీసుకువచ్చారు. ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు యాలినివో వల్ల వర్షపాతం తగ్గి ఈరోజు రైతులు పెద్ద ఎత్తున భూమిలో పంట వేయలేనటువంటి పరిస్థితి ఉంది. ఒకవైపు వేసిన పంటలను తుపానులు వరదలు ముంచి పంటలను సర్వనాశనం చేసిన పరిస్థితి చూశాం. ఇన్ని వ్యాయా ప్రయాసలకు లోబడి రైతు పండించినటువంటి పంటకు మార్కెట్లో సరైనటువంటి గిట్టుబాటు ధర లేకపోవడం వీరి శ్రమ శక్తిని దళారులు దోచుకోవటం ఇవన్నీ కూడా ప్రభుత్వం సోధ్యం చూసినట్లు చూస్తూ ఉంది. అన్నిటికంటే దారుణమైనటువంటి పరిస్థితి వ్యవసాయ ఉత్పత్తులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునేటటువంటి ఒప్పందాన్ని అమెరికాతో కుదిరించుకోవడం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడి మేరకు అమెరికాలోని వ్యవసాయ ఉత్పత్తులు భారతదేశంలోనికి దిగుమతి చేసుకోవడం ఆ ఉత్పత్తులో ఇక్కడ రావటం వల్ల ఇక్కడ ఈ దేశంలో పండించినటువంటి రైతుల యొక్క పంటలకు ధరలు పడిపోయి గిట్టుబాటు ధర లేక అనేక మంది రైతులు ఆత్మహత్య చేసుకునేటటువంటి పరిస్థితి ఈ 28 సంవత్సరాల కాలంలో మనం చూసాం. వ్యవసాయ కార్మికులకు ఎంతో ఆసరాగా ఉన్నటువంటి ఉపాధి హామీ పథకాన్ని మార్చి దాన్ని నీరుగార్చి దాన్ని నిర్వీర్యం చేసే దాని కొరకు మోడీ ప్రభుత్వం తీవ్రమైనటువంటి కృషి చేస్తుంది. ప్రజా పోరాటాల ద్వారానే మన సమస్యలను ప్రభుత్వాలు చేసేటువంటి తప్పులను ఎండగట్టి వాళ్ళని వెనక్కి కొట్టే దాన్ని కొరకు రైతులు కూలీలు కార్మికులు అందరూ కూడా ఐక్యమై దుర్మార్గమైనటువంటి చర్యలు తిప్పుకొట్టాల్సినటువంటి అవసరం ఎంతైనా ఉంది. దానికి ఎర్రజెండా నాయకత్వం వహిస్తుంది. అందరూ ఆ యొక్క రాజకీయాలను బలపర్చాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఆ రకంగా చేయటం వల్ల మాత్రమే ప్రజల యొక్క కష్టాలు తొలగిపోవడానికి అవకాశం ఉంది. అప్పుడు మాత్రమే మనం శేషయ్య కి నిజమైనటువంటి నివాళులు అర్పించిన వాళ్ళం అవుతాం దాని కొరకు మీరందరూ కూడా భారత కమ్యూనిస్టు పార్టీ రాజకీయాలలో ప్రజా ఉద్యమాలను మద్దతు ఇచ్చే ముందుకు నడిపిస్తారని భావిస్తున్నాం. ఈ కార్యక్రమంలో చిన్న శేషయ్య కుటుంబ సభ్యులు కొడుకు కూతురు కోడళ్ళు చెరుకుమల్లి పురుషోత్తం చెరుకుమల్లి రాధా కొల్లి బేబీ పాల్గొన్నారు. వారితో పార్టీ చెరుకుమల్లి మోహన్రావు చింతనూర్ హేమలత తాత మాధవి, తాతా సీత ఆపగంటి ఆశీర్వాదం గుడిమెట్ల గణేష్ కంపసాటి కరుణాకర్ గమ్మిడి నరేష్ దమ్మలపాటి మురళి కొప్పల కోటయ్య సిపిఐ నాయకులు పాపగంటి సుదర్శన్ కొప్పుల మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

సారపాకలో ఘనంగా బిపిఎల్ స్కూల్ వార్షిక క్రీడా మహోత్సవం

క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించిన

ఐటీసీ హెడ్ యూనిట్ శైలేందర్ సింగ్

భద్రాద్రి జిల్లా నవంబర్ 28 (తొలివార్త): బూర్గంపహాడ్ మండలం సారపాకలోని భద్రాచలం పబ్లిక్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో వార్షిక క్రీడా మహోత్సవం అన్యుల్ స్పోర్ట్స్ మీట్ 2026 --ఓడి వై ఎస్ ఎస్ ఈ వై కె హెచ్ ఈ ఎల్ ఓ, బిపిఎస్ వేడుకలు శనివారం అట్టహాసంగా నిర్వహించారు. నర్సరీ నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆటలు, పాటలు, క్రీడా విన్యాసాలతో క్రీడా ప్రాంగణాన్ని సందడిమయం చేశారు.ఈ క్రీడా మహోత్సవాన్ని ఐటీసీ హెడ్ యూనిట్ శైలేందర్ సింగ్ క్రీడాజ్యోతిని వెలిగించి ఘనంగా ప్రారంభించారు. విద్యార్థుల మార్చ్‌పాస్ట్, వివిధ క్రీడా ప్రదర్శనలు, పోటీల్లో చిన్నారులు కనబరిచిన ప్రతిభ, ఉత్సాహం, క్రమశిక్షణ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల నుంచి పెద్ద తరగతుల విద్యార్థుల వరకు ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, భద్రాచలం సబ్ కలెక్టర్ శ్రీ మృణాల్ శ్రేష్ఠ, ఐఏఎస్, మరియు 1. శ్రీ దినేష్ కుమార్



2-1/ సి, సెకండ్ ఇన్ కమాండ్.2. శ్రీ గౌరవ్ కుమార్ శర్మ.డిప్యూటీ కమాండెంట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఐటీసీ వైస్ ప్రెసిడెంట్ శ్యామ్ కిరణ్, ఐటిసి హెచ్ఆర్ మేనేజర్ డిపి రాయ్.. ఐటీసీ పీఆర్ఓ చంగల్ రావు, భద్రాచలం పబ్లిక్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. ప్రశాంత్ యు. కిట్టులే తదితర ప్రముఖులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. అనంతరం పాఠశాలలో విద్యా ప్రతిభ కనబరిచిన మెరిట్ విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ



లక్షణాలు, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు.విద్యార్థుల ఉత్సాహభరితమైన ఆటపాటలు, రంగురంగుల ప్రదర్శనలు, క్రీడా విన్యాసాలతో సారపాకలో క్రీడా సంబరాలు అంబరాన్నంటాయి. కే హెచ్ ఈ ఎల్ ఓ- బి పి ఎస్, -- గెలుపే లక్ష్యంగా, క్రీడలే స్ఫూర్తిగా సాగిన ఈ వార్షిక క్రీడా మహోత్సవం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మనసులో మరువలేని మధుర జ్ఞాపకంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు ఐటిసి ఉద్యోగులు మరియు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్లరేపాకలో గ్రామసభ.. అభివృద్ధి పనులపై చర్చ

గ్రామ సమస్యలను పరిష్కరిస్తాం

సర్పంచ్ దేశబోయిన బాలస్వామి యాదవ్

వలిగొండ, నవంబర్ 28 (తొలివార్త): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో ప్రత్యేకాధికారి పాలనలో గ్రామానికి వచ్చిన నిధులు, వాటితో చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన ఖర్చుల వివరాలతో పాటు, నూతనంగా సర్పంచ్ ఎన్నికైన అనంతరం గ్రామానికి వచ్చిన నిధులు, వాటి వినియోగానికి సంబంధించిన వివరాలను గ్రామ కార్యదర్శి నాగరాజు సభలో ప్రజలకు చదివి వినిపించారు. అనంతరం గ్రామ అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సభలో చర్చించారు. ఈ సందర్భంగా కందుల నరసింహ మాట్లాడుతూ గ్రామంలోని శివాలయం ప్రాంతంలో మురుగునీటి కాలువల సమస్య తీవ్రంగా ఉందని, డ్రైనేజీ పనులను త్వరితగతిన చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అలాగే గ్రామంలో రైతులు పండించిన ధాన్యాన్ని



విక్రయించుకోవడానికి సరైన మార్కెట్ సదుపాయం లేకపోవడంతో శివాలయం, మల్లన్న గుడి పరిసరాలతో పాటు వివిధ ప్రాంతాల్లో ధాన్యం రాశులు పోసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో ధాన్యం విక్రయాల కోసం అనువైన మార్కెట్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గ్రామంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించేందుకు సరైన స్మశానవాటిక సదుపాయం లేదని, గతంలో నిర్మాణం చేపట్టిన స్మశానవాటిక పనులు కూడా పూర్తిస్థాయిలో పూర్తికాలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు.



పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ సమస్యలపై స్పందించిన గ్రామ సర్పంచ్ దేశబోయిన బాలస్వామి యాదవ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు సభలో ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ గ్రామసభలో ఉపసర్పంచ్ కోమల్ల కుమార్ (ధోని), వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి నాగరాజు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవ సహిత అయ్యప్ప దేవాలయంలో నిత్య అన్నప్రసాద వితరణ

చౌటుప్పల్, నవంబర్ 28 (తొలివార్త): శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అయ్యప్ప భక్తులకు మంచికంటి శ్రీశైలం గుప్తా-మల్లీశ్వరి దంపతులు మరియు వారి కొడుకు కోడలు మంచికంటి ప్రతి గుప్తా -రాధ దంపతులు మరియు మనుమరాలు ప్రణవి,ఆద్య అన్నప్రసాద వితరణ నిర్వహించారు.ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి దేవాలయ అర్చకుడు మరియు గురుస్వాముల చేత దాతలకు ఆశీర్వచనం చేశారు.ఈ సందర్భంగా అన్నదాతలు మాట్లాడుతూ శ్రీ అయ్యప్ప స్వామి కృపా కటాక్షములు తమపై ఉండాలని కోరుకున్నారు.ప్రతి సంవత్సరం అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాద వితరణ చేసే శక్తిని,భక్తిని అయ్యప్ప స్వామి ఇవ్వాలని దేవాలయంలో కోరుకున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి గురుస్వామి,వ్యవస్థాపక అధ్యక్షులు బొబ్బిళ్ళ మురళి గురుస్వామి,మాజీ అధ్యక్షులు కామిశెట్టి భాస్కర్ గురుస్వామి,ప్రముఖ పారిశ్రామికవేత్త మంచికంటి భాస్కర్ గుప్తా,దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి తూర్పాటి శంకర్ గురుస్వామి,డాక్టర్ మంచికంటి



వెంకటేశ్వర్లు-డాక్టర్ రాజేశ్వరి దంపతులు,మంచికంటి నాగభూషణం,ఉప్పు ఆంజనేయులు గురుస్వామి,కంచరకుంట్ల వెంకటరెడ్డి గురుస్వామి,తాడూరు పరమేష్ గురుస్వామి,డాక్టర్ అనిల్ గురుస్వామి,పెద్దగోని రమేష్ గౌడ్ గురుస్వామి,భిక్షా నాయక్ గురుస్వామి,అల్లి కృష్ణ గురుస్వామి,బొడిగె బాలకృష్ణ గౌడ్ స్వామి,బోరం రాజశేఖర్ రెడ్డి గురుస్వామి,కాసర్ల శ్రీనివాస్ రెడ్డి కన్నె స్వామి,పాశం కృష్ణ గురుస్వామి,సుక్క సుదర్శన్ గురుస్వామి,బాలగోని మల్లేష్ గురుస్వామి,మలిగే శ్రీను గురుస్వామి,ఉష్కాగుల నాగరాజు



స్వామి,పాలమాకుల అశోక్ గురుస్వామి,బండమీది మల్లేష్ కన్నె స్వామి,బుర్ర శివకుమార్ స్వామి,పల్లెకాడు దర్శన్ స్వామి,బాలగోని రాము స్వామి,బాలగోని లక్ష్మణ స్వామి,బొబ్బిళ్ళ సామ్రాట్ గురుస్వామి,బొడ్డు రాజేందర్ రెడ్డి,చిన్ని కృష్ణ స్వామి,ఇమ్మడి ఈశ్వర్ స్వామి,ఓర్సు రాజ స్వామి,విక్రమ్ కన్నె స్వామి,సోను నాయక్ కన్నె స్వామి,బాబు చారి కన్నె స్వామి,బోరెం శేఖర్ రెడ్డి స్వామి తదితర అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న కళ్యాణ మండపానికి శంకుస్థాపన భూమి పూజలో పాల్గొన్న

జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్

కొత్వాల శ్రీనివాసరావు విమలాదేవి దంపతులు

భద్రాద్రి జిల్లా నవంబర్ 28 (తొలివార్త): పాల్వంచ పట్టణంలోని కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న



కళ్యాణ మండపాని కి,శనివారం, శ్రీశ్రీశ్రీ శ్రీ దండి రామానుజ చిన్న జీయర్ స్వామి, శంకుస్థాపన చేశారు. పాల్వంచకు వచ్చిన



చిన్న జీయర్ స్వామికి భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్,పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సతీమణి పాత పాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు 36వ డివిజన్ కార్పొరేటర్ పైడిపల్లి జయలక్ష్మి, పైడిపల్లి మహేష్ లు పాల్గొన్నారు.

శ్రీనివాసగిరి(గుట్ట పక్కన) శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేసిన కొత్వాల దంపతులులిపాల్వంచ శ్రీనివాస కాలనీలోని శ్రీనివాసగిరి (గుట్ట పక్కన) శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో స్వామివారిని కొత్వాల, శ్రీనివాసరావు సతీమణి విమలాదేవి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమాల్లో కొత్వాల తో పాటు కార్పొరేటర్లు కొత్వాల విమలాదేవి, పైడిపల్లి జయలక్ష్మి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.సుజాత, డి.ఇ శ్రీనివాస్, దేవాలయం ధర్మకర్త కొత్త వెంకటేశ్వర్లు(మైక్),కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి మహేష్, దేవి వెంకన్న, సువ్వారపు వెంకటేశ్వరరావు,ఇటుకల శ్రీను,చావా రవి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు

చేసుకోండి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసిన

భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ





భద్రాచలం నవంబర్ 28 (తొలివార్త): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రతి కుటుంబంలో ఒక్కరికి,భరోసా కల్పిస్తూ, ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "ఇందిరమ్మ కుటుంబ 5,లక్షలు జీవిత బీమా పథకం భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆదేశాలతో శనివారం భద్రాచలం పట్టణ కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం నందు స్థానిక సర్పంచ్ పూనెం కృష్ణ అధ్యక్షతన (ప్రతి కుటుంబానికి ఒకరికి ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా 5 లక్షలు భరోసా) పథకం ఎన్రోల్మెంట్ కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పూనెం కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం, భద్రాచలంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారంలో ప్రజలతో ఈ సందర్భంగా సర్పంచ్ పూనెం కృష్ణ మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి,కుటుంబాలకు,ప్రతి కుటుంబంలో ఎవరైనా పెద్దదిక్కు కోల్పోతే ఆకుటుంబానికి ఆర్థిక భద్రత, ఆ కుటుంబానికి భరోసా కల్పించాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఈ బీమా,పథకాన్ని,తీసుకువచ్చిందని,సర్పంచ్ పూనెం కృష్ణ పేర్కొన్నారు. కుటుంబంలో ఎవరికైనా అనుకోని ప్రమాదాలు లేదా అకాల మరణాలు సంభవించినప్పుడు ఆ కుటుంబాలు రోడ్డున పడకుండా ఈ బీమా పథకం అందగా నిలుస్తుందని,సర్పంచ్ పూనెం కృష్ణ తెలిపారు. భద్రాచలం,గ్రామపంచాయతీలోని,ప్రజలు,అర్హులైన,కుటుంబాలు ఇంట్లో ఒక్కరూ చొప్పున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ కుటుంబ వివరాలను నమోదు (ఎన్రోల్మెంట్) చేసుకోవాలని, సర్పంచ్ పూనెం కృష్ణ కోరారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెడుతున్న, కాంగ్రెస్ ప్రజా,ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి గడపకు చేర్చడమే తమ లక్ష్యమని సర్పంచ్ పూనెం కృష్ణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు వార్డు సభ్యులు కార్యకర్తలు మరియు అధిక సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీ స్త్రీలకు ఉచిత ఆటో సర్వీస్ సోషల్ వర్కర్ లతీఫ్.



వైరా నవంబర్ 28 (తొలివార్త): సిరిపురం కేజీ గ్రామంలో సోషల్ వర్కర్ చీఫ్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు ఉచిత ఆటో సర్వీస్ నిర్వహిస్తున్నారు. దాసాపురం గ్రామానికి చెందిన గరిడేపల్లి భవాని అనే గర్భిణీ స్త్రీని టెస్టుల నిమిత్తం వైరా ప్రైవేట్ ఆస్పత్రి తీసుకువెళ్లి టెస్టులు అనంతరం మరల గర్భిణీ స్త్రీని వారి ఇంటి వద్ద దింపడం జరిగింది. ఈ సందర్భంగా సోషల్ వర్కర్ లతీఫ్ మాట్లాడుతూ వైరా మండలంలోని కొన్ని పరిసర గ్రామాలు మరియు తల్లాడ మండలంలోని కొన్ని పరిసర గ్రామాల గర్భిణీ స్త్రీలకు 24 గంటలు ఉచిత ఆటో సర్వీస్ అందుబాటులో ఉంటుందని, గర్భిణీ స్త్రీలు 24 గంటలు ఏ సమయంలోనైనా వర్కర్ లతీఫ్ కు ఫోన్ చేయొచ్చని, సెల్ నెంబర్ 9603747878 కి ఫోన్ చేయగలరు.

ట్రినిటీ విద్యాసంస్థల్లో ప్రీ ప్రైమరీ

విద్యార్థులకు జలచరాలపై ప్రత్యేక ప్రదర్శన





చౌటుప్పల్, నవంబర్ 28 (తొలివార్త): ట్రినిటీ విద్యాసంస్థల్లో ప్రీ ప్రైమరీ విద్యార్థినీ విద్యార్థులకు నీటిలో జీవించే జీవాల గురించి తెలియజేసేందుకు ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీటి రకాలు ఉప్పునీరు, మంచినీరు, ఫ్లోరైడ్ నీరు, రాగినీరు వంటి నీటి రకాలను,వాటి విశిష్టతను, లభ్యత ప్రాంతాలను సవివరంగా వివరించారు.ఉప్పునీరు సముద్రంలో, మంచినీరు నదులలో ,ఫ్లోరైడ్ సాంద్రత గల నీరు బోరుబావులలో లభిస్తుందని తెలిపారు.ఆ జలాలలో జీవించే తాబేలు,వివిధ రకాల చేపలు, తిమింగలాలు, ఆక్టోపస్,డాల్ఫిన్, మొసలి వంటి వివిధ రకాల జలచరాలు మరియు వృక్షజాతులను ఫోటోలతో సవివరంగా వివరించి అవగాహన కలిగించారు.వర్షపు నీటిని ఎలా కాపాడుకోవాలి, సంవత్సరం పొడవునా జాగ్రత్తగా ఎలా వాడాలి,వృధా కాకుండా ఎలా చూడాలి,ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కోవడం ఎలా అనే అంశాలపై ఫోటో ప్రదర్శన నిర్వహించారు. "నీటిని కాపాడుకుందాం -జలచరాలను రక్షిద్దాం"అని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. నేటి కార్యక్రమ విశిష్టతను,ప్రపంచంలోని జీవులకు నీటి అవసరం,ప్రాముఖ్యతను ట్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్ కం ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జిని మంజుల బుడిబుడి పలుకుల విద్యార్థులకు హృదయాన్ని హత్తుకునేలా వివరించారు.ఈ కార్యక్రమం ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కె.వి.బి కృష్ణారావు అధ్యక్షతన కనుల పండుగగా జరిగింది.ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు లోవకుమారి, భార్గవి,స్వరూప, వనజ,పూజ మరియు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ ఆందోల్ మైసమ్మ హుండీ లెక్కింపు

రూ.16,14,027 ఆదాయం

చౌటుప్పల్, నవంబర్ 28 (తొలివార్త): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామం లోని శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానంలో శుక్రవారం దేవస్థాన ప్రాంగణంలో దేవదాయ శాఖ నల్లగొండ వారి ఆధ్వర్యంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను లెక్కించడం జరిగింది.135 రోజులకు గాను నోట్ల ద్వారా రూ.15,32,250/-,చిల్లర ద్వారా రూ.81,777/-,మొత్తంగా రూ. 16,14,027/-(పదహారు లక్షల పద్నాలుగు వేల ఇరవై ఏడు రూపాయలు) ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ కంచర్ల అశ్విని రెడ్డి మరియు ధర్మకర్తలు జొన్నకంటి దాసు,డి.రాజేష్,ఈ.బాబు,ఎస్.ఆనంద రెడ్డి,వి.శివాచారి, బి.నరసింహ, ఎం.మహేందర్ రెడ్డి,బి.యువరాజు,పి.రమేష్,బి.శ్రీకాంత్, సిహెచ్.సబిత మరియు గ్రామపంచాయతీ వార్డ్ సభ్యులు సుక్క రవీందర్,ఈదుతుల ఇంద్రసేనారెడ్డి,ఫకీరు వంశీధర్ రెడ్డి,సేవా సమితి సభ్యులు,పోలీస్ సిబ్బంది ఏ.సైదయ్య,పి.కుమార్ మరియు దేవస్థాన ఆలయ సిబ్బంది,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ఓబీసీ మహాధర్నాలో పాల్గొన్న ఇ.ఎల్.వి భాస్కర్

2027 జనగణనలో ప్రత్యేక ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయాలి

ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో డిమాండ్



మునుగోడు, నవంబర్ 28(తొలివార్త): దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీ హక్కుల సాధన కోసం శనివారం న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'చలో ఢిల్లీ' పేరుతో భారీ ఓబీసీ మహాధర్నా నిర్వహించారు. తెలంగాణ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు ఉమ్మడి నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం నుండి ఇ.ఎల్.వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు,యువత,మహిళలు మరియు బీసీ సంఘాల నాయకులు ఈ మహాధర్నాలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇ.ఎల్.వి. భాస్కర్ మాట్లాడుతూ..దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న ఓబీసీల న్యాయమైన హక్కుల సాధన కోసం సమగ్ర కులగణన అత్యంత అవసరమని పేర్కొన్నారు.2027 జనగణనలో ప్రత్యేక ఓబీసీ కాలమ్‌తో పాటు ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ కేటాయించడం ద్వారానే అసలైన లెక్కలు బయటకు వస్తాయని ఆయన స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వం తక్షణమే సానుకూలంగా స్పందించి,ఓబీసీల చిరకాల వాంఛను నెరవేర్చకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ మహాధర్నాకు దేశవ్యాప్తంగా ఉన్న 60కి పైగా బీసీ సంఘాల వేలాది మంది ప్రతినిధులు,పలు రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు.స్వరాజ్ ఇండియా నేత యోగేంద్ర యాదవ్,మహారాష్ట్ర కాంగ్రెస్ నేత విజయ్ వడెట్టివార్,ఆర్జేడీ ఎంపీ సంజయ్ యాదవ్,ఐఎన్ఎల్‌డీ నేత అభయ్ చౌతాలా సహా పలువురు నేతలు ఈ ఉద్యమానికి మద్దతుగా నిలిచి ప్రసంగించారు.కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఓబీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నేతలు విజ్ఞప్తి చేశారు.

వైరాలో జరిగే దీక్ష దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

కొనిజర్ల మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు పోట్ల శ్రీనివాసరావు.

రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు కిలారు మాధవరావు.



కొనిజర్ల నవంబర్ 28 (తొలివార్త): వైరాలో జరగబోయే దీక్ష దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొనిజర్ల మండల బి ఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు పోట్ల శ్రీనివాసరావు, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు కిలారు మాధవరావు మల్లుపల్లి గోపవరం పెద్ద గోపతి చిన్నగోపతి తీగల బంజర అమ్మపాలెం గ్రామాలలో గ్రామ శాఖల సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యకర్తలకు దీక్ష దివాస్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఉదయం 10 గంటలకు కొనిజర్ల నుండి బైక్ ర్యాలీతో వైరా దీక్షా దివాస్ కార్యక్రమానికి హాజరుకావాలని నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పోట్ల శ్రీనివాసరావు కిలారు మాధవరావు దొడ్డపులేని రామారావు పొట్లపల్లి జిడ్డయ్య పోగుల శ్రీను పసంగులపాటి శ్రీను చల్లా మోహన్ రావు జట్ల శ్రీను అద్దంకి చిరంజీవి సర్పంచులు నునవత్ శ్రీను రాయల నాగేశ్వరరావు భూక్య రామదాస్ మలోత్ భాషా వెంకటరత్నం మొలానా ఆర్పి బిక్షం సామినేని భాస్కరరావు చిరంజీవి బోరా ప్రసాద్ ఆదర్ బాబా రాజ్ కుమార్ చావగానే వెంకట పిచ్చయ్య రాపోలు రాజేశ్వరరావు గోపాలస్వామి కృష్ణ వినయ్ ఎస్టి రహీం ఎస్టి సైదా సోమశేఖర్ నునావత్ సైదా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై బాలల హక్కుల కమిషన్ ఆరా





నూతనకల్. నవంబర్ 28 (తొలివార్త): మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ సంక్షేమ హాస్టల్‌ను తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని వసతి సౌకర్యాలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి హాస్టల్‌లో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో సరైన సదుపాయాలు లేవని, పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు వారి దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల సమస్యలను సావధానంగా విన్న వారు, హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, భోజనం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం సంబంధిత అధికారుల బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పింఛన్లు ఖాతాల్లో జమ కావడంతో లబ్ధిదారుల్లో ఆనందం



నూతనకల్. నవంబర్ 28 (తొలివార్త): మండల పరిధిలోని బక్క హేమల తండా గ్రామపంచాయతీలో శనివారం నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ కావడంతో వారిలో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుగులోత్ కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో నూతన పింఛన్దారులతో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఎన్నో రోజులుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న తమకు ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. పింఛన్ సొమ్ము తమ కుటుంబ అవసరాలకు, మందులు మరియు నిత్యావసర ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతుందని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుగులోత్ కృష్ణ నాయక్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. నూతనంగా పింఛన్లు పొందిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కారు ఢీకొని యువకుడు మృతి

ఇద్దరికి గాయాలు

చౌటుప్పల్, నవంబర్ 28 (తొలివార్త): చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామానికి చెందిన పిసాటి వినయ్ రెడ్డి (దామోదర్ రెడ్డి కుమారుడు)తన స్నేహితులైన కొంత సాత్విక్ రెడ్డి(సత్తి రెడ్డి కుమారుడు),పంతం సుఖేందర్ (గోవర్ధన్ రెడ్డి కుమారుడు)లతో కలిసి తేదీ 27-11-2026 రోజున రాత్రి సుమారు11:30 సమయంలో హ్యుందాయ్ క్రెట కారు నంబర్ ూ 07 ఖీ 5679 లో హైదరాబాద్‌కు బయలుదేరారు.ఈ క్రమంలో తేదీ 28.11.2026 రోజున తెల్లవారుజామున సుమారు 01:15 గంటలకు చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట గ్రామ పరిధిలోని జాతీయ రహదారి-65పై ఫ్లైఓవర్ వద్దకు చేరుకోగానే,వారి ముందు వెళ్తున్న టాటా ఇంట్రా వాహనం నంబర్ ఱ+ 05 ఱ 8278 ను కారు నడుపుతున్న కొంత సాత్విక్ రెడ్డి అతివేగంగా,అజాగ్రత్తగా నడిపి వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో కారు ముందు సీటులో డ్రైవర్ పక్కన కూర్చున్న పిసాటి వినయ్ రెడ్డికి తలకు మరియు శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.కారు డ్రైవింగ్ చేస్తున్న కొంత సాత్విక్ రెడ్డి,వెనుక సీటులో కూర్చున్న పంతం సుఖేందర్‌లకు గాయాలయ్యాయి.గాయపడిన ఇద్దరినీ అంబులెన్స్ ద్వారా హయత్‌నగర్‌లోని నీలాద్రి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ ఘటనకు సంబంధించి మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ కొంత సాత్విక్ రెడ్డిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసులు తెలిపారు.

ప్రజా ప్రభుత్వ పథకాల అమలు అభివృద్ధిపై అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొన్న

ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు



భద్రాద్రి జిల్లా నవంబర్ 28 (తొలివార్త): మణుగూరు మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు మండల పరిధిలోని సర్పంచులతో, శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు ప్రజాభవన్లో పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మండలంలోని వివిధ శాఖల పనితీరు, గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పురోగతి, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై శాఖల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం (జీరో కరెంట్ బిల్లు), ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, రైతు భరోసా, మహిళా సంక్షేమ కార్యక్రమాలు, ఇతర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రత్యేకంగా చర్చించారు. ప్రతి పథకం అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం: అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల మంజూరు, నిర్మాణ పనుల పురోగతి, లబ్ధిదారులకు విడతల వారీగా ఆర్థిక సహాయం అందుతున్న తీరును సమీక్షించారు. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా చూడాలని సూచించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం: అర్హులైన కుటుంబాలకు జీరో విద్యుత్ బిల్లులు అందుతున్నాయా లేదా పరిశీలించాలని, సాంకేతిక సమస్యల వల్ల ఎవరైనా పథకం ప్రయోజనం పొందలేకపోతే వాటిని వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం: ఈ పథకంపై గ్రామస్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, అర్హులైన కుటుంబాలను గుర్తించి అవసరమైన వివరాల సేకరణ, నమోదు ప్రక్రియను సంబంధిత శాఖల సమన్వయంతో చేపట్టాలని తెలిపారు. పథకం ఉద్దేశం, అర్హతలు, ప్రయోజనాల గురించి ప్రజలకు స్పష్టంగా వివరించి అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రయోజనాలు అందేలా చూడాలని సూచించారు. రైతు భరోసా -- వ్యవసాయ రంగం: రైతు భరోసా పథకం ద్వారా రైతులకు అందుతున్న ఆర్థిక సహాయం, అర్హులైన రైతుల వివరాలు, వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న సేవలపై సమీక్షించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం సకాలంలో అందేలా చూడాలని, రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుత పంటల సాగు పరిస్థితులు, సాగునీటి లభ్యత, విత్తనాలు, ఎరువుల సరఫరా, పంటల దిగుబడి తదితర అంశాలపై రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు.ఎల్‌నినో ప్రభావం -- పంటల సాగుపై రైతులకు అవగాహన: వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో సంభవించే మార్పుల నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, తక్కువ నీటితో సాగు చేసే పంటలు, నీటి యాజమాన్య పద్ధతులు, పంటల సంరక్షణ, తెగుళ్లు మరియు చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వాతావరణ శాఖ సూచనలు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాల మేరకు రైతులు సాగు ప్రణాళికలు,రూపొందించుకునేలా,అధికారులు,సహకరించాలని పేర్కొన్నారు.వీబీ--జీ రామ్ జీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు, గ్రామీణ కుటుంబాలకు పనుల కల్పన, గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ పథకానికి సంబంధించిన ప్రభుత్వ మార్గదర్శకాలు, అమలు విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామీణ కూలీలకు ఉపాధి అవకాశాలు అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి పారదర్శకంగా అమలు చేయడంతో పాటు కూలీలకు అందాల్సిన చెల్లింపులు సకాలంలో జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. విద్యా రంగం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న ప్రభుత్వ సౌకర్యాలపై సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది అందుబాటు, మందుల సరఫరా, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న వైద్య సేవలపై చర్చించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ గ్రామస్థాయిలో ముందస్తు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.గ్రామీణ మౌలిక వసతులు, అభివృద్ధి పనులు: మండలంలోని గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు, విద్యుత్ తదితర మౌలిక వసతుల సమస్యలను సర్పంచుల ద్వారా తెలుసుకున్నారు. గ్రామాల వారీగా అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, విద్య, వైద్య రంగాల బలోపేతం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.ప్రజాప్రతినిధులు, సర్పంచులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, రైతులకు వ్యవసాయ రంగంలో అవసరమైన సాంకేతిక సలహాలు, వాతావరణ సమాచారంపై అవగాహన కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో మణుగూరు మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మండల పరిధిలోని సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



జీవిత లక్ష్య సాధనకు నిర్ణయం ఈరోజే తీసుకోవాలి

వివాహానికి ముందే మన సత్తా ఏమిటో సమాజానికి చాటాలి

విద్యార్థులకు తన జీవితంలోని ఆటుపోట్లు, విజయాలను

వివరించిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు బొంపల్లి భవానీ



భువనగిరి, నవంబర్ 28 (తొలివార్త): జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఈరోజే కావాలని, వివాహానికి ముందే ప్రతి ఒక్కరూ తమ ప్రతిభను, సత్తాను సమాజానికి చాటాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బొంపల్లి భవానీ అన్నారు. కష్టాలను ఎదుర్కొంటూ పట్టుదలతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను తప్పకుండా సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని చిలుముల శివరాజిని నారాయణరెడ్డి (సీఎస్ఎన్ఆర్) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన స్ఫూర్తి సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు రెండు గంటలపాటు తన జీవితంలో ఎదుర్కొన్న ఆటుపోట్లు, అనుభవాలు, సాధించిన విజయాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా బొంపల్లి భవానీ మాట్లాడుతూ తమ కుటుంబంలో మొట్టమొదటి ప్రభుత్వ ఉద్యోగిగా, గ్రామంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో పాటు జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోవడం గర్వకారణమని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత పిన్న వయసులో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నవారిలో ఒకరిగా నిలవడం తన జీవితంలో మరిచిపోలేని ఘట్టమని పేర్కొన్నారు. ఒకప్పుడు కేవలం 40 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలను తన కృషి, అంకితభావంతో 140 మంది విద్యార్థులు చదివే స్థాయికి తీసుకెళ్లానని వివరించారు. ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా ఇష్టమైన బాధ్యతగా స్వీకరించి ఆనందంగా పనిచేశానని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని యూట్యూబ్ ఛానల్ ప్రారంభించి సుమారు ఎనిమిది లక్షల మంది చందాదారులను సంపాదించుకున్నానని, తద్వారా 'యూట్యూబ్ పంతులమ్మ'గా ప్రత్యేక గుర్తింపు పొందానని చెప్పారు. మనిషి జీవితంలో అన్నింటికంటే ముఖ్యమైనది మంచి వ్యక్తిత్వమని, మంచి నడవడికతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని అన్నారు. చిన్నతనంలో తన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కలలు కన్నానని, నిరంతర శ్రమతో నేడు తన జిల్లాకు, రాష్ట్రానికి జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురాగలిగానని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు ముఖ్యంగా గణితంలో ప్రతిభ సాధించాలంటే నిరంతర సాధన ఎంతో అవసరమని సూచించారు. కష్టపడి పనిచేసే వారికి ఎప్పటికైనా మంచి ఫలితాలు లభిస్తాయని, ఫలితాల కోసం ఓపికగా ఎదురుచూడాలని, జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా అధిగమించాలని పిలుపునిచ్చారు. 'కష్టపడటం ఎప్పుడూ వృథా కాదు' అనే సూత్రాన్ని ప్రతి విద్యార్థి జీవితంలో అలవర్చుకోవాలని హితవు ెలికారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి దంపతులను బొంపల్లి భవానీ దంపతులు సన్మానించారు. అదే విధంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బొంపల్లి భవానీ, ఆమె భర్త సూర్యను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వెంకటేశం, నర్సింహ, శ్రీనివాస్ రెడ్డి, అవనీధర్, వెంకటయ్య, హరికృష్ణ, రాధిక, అలువేలు మంగ, ఇమ్రాన్, ఆంజనేయులు, నరేందర్ రెడ్డి, పాశికంటి వెంకటేష్, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బాచుపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఆందోళన!



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నవంబర్ 28,తొలి వార్త ప్రతి నిధి. హాస్టల్‌లో విద్యార్థులకు అందించే భోజనంలో పురుగులు వస్తున్నాయని, నాసిరకమైన వస్తువులతో ఆహారం తయారు చేసి పెడుతున్నారని విద్యార్థులు ఆరోపించారు.ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ కేర్‌టేకర్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యార్థులు.. కేర్‌టేకర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ హాస్టల్ ఎదుట ధర్నాకు దిగారు.

జ్యోతిరావు పూలే పూర్తి తో బహుజనుల ఐక్యమై రాజ్యాధికారం కోసం పోరాడాలి

కాంగ్రెస్ నాయకులు రాస్తే ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్



.కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నవంబర్ 28,తొలి వార్త ప్రతి నిధి. జ్యోతిరావు పూలే పూర్తి తో బహుజనుల ఐక్యమై రాజ్యాధికారం కోసం పోరాడాలి కాంగ్రెస్ నాయకులు రాస్తే ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ పిలుపు రోడా మేస్త్రి నగర్ డివిజన్ మగ్దుంనగర్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ గూడ వరమ్మ కార్యాలయంలో జ్యోతి రావు పులే వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్రీయ ఒబిసి జాతి అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న దురాచారాలకు వ్యతిరేకంగా మహిళలు చదువుకోవాలని చదువుతోటే గౌరవం పెరుగుతుందని నాటి దురాచారాలను తరిమికొట్టి తన భార్యను టీచర్గా మార్చి మహిళలకు విద్య అందించిన మూర్తి జ్యోతిరావు పూలే గారని అన్నారు భారతదేశంలో ఉన్న దళిత బహుజనులు ఏకం కావాలని పిలుపునిచ్చారు నేడు కేంద్ర ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం బహుజనుల పై దాడి జరుగుతుందని కుల గణనలో బీసీ కాలం పెట్టకపోవడం బీసీలపై నరేంద్ర మోడీ ప్రభుత్వ వైఖరి బయటపడ్డదని అన్నారు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు 90 శాతం ఉన్నామని 10 శాతం వాళ్లు రాజ్యం పరిపాలిస్తున్నారని రాబోయే కాలంలో అంబేద్కర్ చెప్పిన విధంగా బహుజనులు రాజ్యాధికారం కోసం ఏకమై పోరాడాలని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వరమ్మ గారు జయమంగా సులోచన యాదగిరి తదితరులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నవంబర్ 28,తొలి వార్త ప్రతి నిధి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 292వ సాయిబాబా నగర్ డివిజన్ పరిధిలోని అపురూప కాలనీలో డివిజన్ అధ్యక్షులు హరి కిరణ్ , సీనియర్ కాంగ్రెస్ నాయకులు సీతారాం రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంతో పాటు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు.ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి. మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా కల్పించడం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ పథకం ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు, కుటుంబ సంక్షేమానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభ్యున్నతే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రావణ్ కుమార్, డీసీసీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ కరణ్, కుత్బుల్లాపూర్ మైనారిటీ చైర్మన్ అబ్దుల్ గఫార్, డివిజన్ మైనార్టీ అధ్యక్షులు యాసీన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, రాజు చారి, నాగేష్ రెడ్డి, నరసింహారెడ్డి, అంజిరెడ్డి, రామ్ చందర్, నజీర్, ఆదినారాయణ, శ్రీధర్, మహిళ నాయకురాలు నాగశిరోమణి, అర్చన, హృదయ కుమారి, శైలజ, వనిత మరియు వివిధ డివిజన్ అధ్యక్షులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు దూరంగా ఉండాలి

రౌడీషీటర్లకు ఏసీపీ మోహన్ కుమార్ కౌన్సెలింగ్.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు.. సీఐ జలంధర్ రెడ్డి.



మేడిపల్లి, నవంబర్ 28; (మెట్రో న్యూస్) మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు శనివారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మేడి

డీలిమిటేషన్‌తో మారనున్న తెలంగాణ రాజకీయ ముఖచిత్రం

26 ఎంపీ సీట్లు, 182 అసెంబ్లీ స్థానాలు

డీలిమిటేషన్‌తో రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు పెరగనున్నట్లు తెలుస్తోంది

దీని ప్రభావం రాష్ట్రంపై ఎంత వరకు ఉంటుందనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం



డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన), మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందితే రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం ఉన్న 119 అసెంబ్లీ స్థానాలు 182 లేదా 192కు పెరిగే అవకాశం ఉంది. లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26 స్థానాలకు చేరుకోనున్నాయి. ఫలితంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాలు పెరగడంతో పాటు మహిళా ప్రజా ప్రతినిధుల సంఖ్య గణనీయంగా పెరగనుంది.డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన బిల్లులు ఈ నెల 30న లోక్‌సభ ముందుకు రానుండటంతో వాటి ప్రభావం తెలంగాణలో ఎలా ఉంటుందన్న దానిపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఈ రెండు బిల్లులు ఆమోదం పొందితే రాష్ట్ర రాజకీయాల్లో అనేక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలుండగా, బిల్లు ఆమోదం పొందితే ఈ సంఖ్య 26కు పెరిగే అవకాశం ఉంది.అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు పెరిగే అవకాశం ఉంది. మిగతా జిల్లాలతో పోల్చుకుంటే గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఎక్కువ సీట్లు పెరిగే అవకాశాలున్నాయి. అంతే కాకుండా ఎస్సీ, ఎస్టీ స్థానాల సంఖ్య పెరగడంతో పాటు కొత్తగా రాబోయే రిజర్వేషన్ల వల్ల మహిళా ప్రజాప్రతినిధుల సంఖ్య గణనీయంగా పెరగనుంది. రాష్ట్రం నుంచి లోక్‌సభకు 8 లేదా 9 మంది, శాసనసభకు సుమారు 60 మంది మహిళలు ఎన్నికయ్యే అవకాశం ఉంది.2014 నాటి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ప్రతీ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో అదనంగా రెండు అసెంబ్లీ సీట్ల చొప్పున పెంచాలని ప్రతిపాదించారు. దీని ప్రకారం 34 సీట్లు పెరగాల్సి ఉండగా, తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బిల్లులో ప్రతి రాష్ట్రంలో నేరుగా 50 శాతం స్థానాలు పెంచేలా ప్రతిపాదించారు. ఇది ఆమోదం పొందితే రాష్ట్రానికి కొత్తగా 60 అసెంబ్లీ స్థానాలు వస్తాయి.కానీ ప్రతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏడు సెగ్మెంట్ల చొప్పున ఉండేలా లెక్కగడితే మొత్తం అసెంబ్లీ స్థానాలు 192కు పెరిగే అవకాశం ఉంది. ఫలితంగా అనేక మంది కొత్తవారికి పోటీ చేసే అవకాశం లభించడంతో పాటు పాత వారి స్థానాలు తారుమారయ్యే పరిస్థితి ఉంది. డీలిమిటేషన్ బిల్లు పాసైతే అధికార కాంగ్రెస్ పార్టీలోని కొందరు నాయకులు మాత్రం వ్యతిరేకత ఉన్న ఎమ్మెల్యేలను మార్చడానికి, కొందరిని ఒకచోట నుంచి ఇంకోచోటకు పంపించడానికి పునర్విభజన తోడ్పడుతుందనే అభిప్రాయంతో ఉన్నారు.నియోజకవర్గాల పునర్విభజనను 2011 నాటి జనాభా లెక్కల ఆధారంగా చేయనున్నందున పాత 10 జిల్లాలనే యూనిట్లుగా తీసుకునే అవకాశం ఉంది. ముందుగా జనాభా, మొత్తం అసెంబ్లీ స్థానాల ఆధారంగా రాష్ట్ర సగటును పరిగణనలోకి తీసుకొని ఒక జిల్లాలో అసెంబ్లీ స్థానాలను ఖరారు చేస్తారు. మొదట జిల్లాలోని అసెంబ్లీ స్థానాలను నిర్ణయించిన తర్వాత ఆ జిల్లాలో జనాభా సరాసరి ఆధారంగా పరిధిని నిర్ణయిస్తారు. ఒక శాసనసభ నియోజకవర్గం పూర్తిగా సంబంధిత ఉమ్మడి జిల్లా పరిధిలోనే ఉండేలా విభజించే అవకాశం ఉంది. జిల్లాల వారీగా నియోజకవర్గాలను ఖరారు చేసిన తర్వాత ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ స్థానాలను నిర్ణయిస్తారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఆతిథ్య రంగానికి రుషికొండ ప్యాలెస్

120 రోజుల్లో టెండర్లు పూర్తి చేయాలని సీఎం ఆదేశం

రుషికొండ ప్యాలెస్ నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు

120 రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు



రుషికొండ ప్యాలెస్ నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. 120 రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్సీపీ హయాంలో రూ.452 కోట్లతో నిర్మించిన రుషికొండ ప్యాలెస్ వినియోగంపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సిఫారసులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ భవన సముదాయాన్ని ఆతిథ్య రంగంలోని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు పిలిచి బిడ్లు ఆహ్వానించాలని సూచించింది. ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రాపర్టీ కన్సల్టెంట్ సంస్థను ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా నియమించాలని ప్రతిపాదించింది. రుషికొండ దిగువన ఉన్న తొమ్మిది ఎకరాల్లో సీఆర్‌జెడ్ నిబంధనల మేరకు ఒక ఎకరంలో నిర్మాణాలకు అవకాశం కల్పించాలని మంత్రివర్గ ఉపసంఘం సూచించింది. కొండ పైనా అదనపు గదుల నిర్మాణానికి స్థలం కేటాయించాలని ప్రతిపాదించింది. నివేదిక ఇవ్వడంలో మంత్రివర్గ ఉపసంఘం జాప్యంపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. టెండర్లు, ఆపరేటర్ల ఎంపిక సహా మొత్తం ప్రక్రియను 120 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అప్పటి వరకు ప్యాలెస్‌ను ప్రజలు సందర్శించేలా ఏర్పాట్లు చేయాలని పర్యాటక శాఖకు సీఎం సూచించారు. తద్వారా ప్రజాధనాన్ని జగన్ ఎలా దుబారా చేశారో వారికి కూడా ప్రత్యక్షంగా తెలుస్తుందని అన్నారు.జనవరి నాటికి పెట్టుబడుల రక్షణ చట్టం: పెట్టుబడిదారుల సదస్సులో ప్రకటించిన విధంగా పెట్టుబడుల రక్షణ చట్టం ముసాయిదాను జనవరికి సిద్ధం చేసి కేంద్రానికి పంపాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కేంద్రం ఆమోదంతో ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తెద్దామని అన్నారు.అమరావతిని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మిస్తుంటే వైఎస్సార్సీపీ నేతలకు కళ్లు కుదుటపడుతున్నాయని, రాజధానిపై వారు పగబట్టారని సీఎం మండిపడ్డారు. శాఖమూరు వద్ద అమరావతి సంగమం ప్రాజెక్టు ప్రతిపాదన చర్చకు వచ్చినప్పుడు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమరావతి రైతుల పోరాటం ఎప్పటికీ గుర్తుండిపోయేలా స్మారక నిర్మాణం చేపట్టాలని మంత్రి లోకేశ్ సూచించగా తప్పకుండా చేద్దామన్నారు. రాయలసీమ ఉద్యాన హబ్ పనులు డిసెంబరు 1 నుంచి ప్రారంభిస్తామని సీఎం చెప్పారు.మరోవైపు పార్వతీపురం మన్యం జిల్లాలోని ఒడిశా సరిహద్దులో ఉన్న కొరియా గ్రామాల్లో ఎన్నికల నిర్వహణకు ఒడిశా పోలీసులు అడ్డంకులు సృష్టిస్తున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మంత్రివర్గం దృష్టికి తీసుకొచ్చారు. ముందస్తు సమాచారం లేకుండా గ్రామాల్లోకి వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారని, ఇద్దరిపై కేసులు నమోదు చేసి బెయిల్‌పై బయటకు తీసుకొచ్చామని వివరించారు. దీనిపై స్పందించిన చంద్రబాబు ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో తక్షణమే మాట్లాడాలని సీఎస్ సాయిప్రసాద్‌ను ఆదేశించారు. అవసరమైతే ఒడిశా ముఖ్యమంత్రితో తానే మాట్లాడతానని స్పష్టం చేశారు.

పదో వసంతంలోకి హైదరాబాద్ మెట్రో

9 ఏళ్లలో 94.2 కోట్ల మంది ప్రయాణం

హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థలో మెట్రో రైలు కీలకపాత్ర పోషిస్తోంది

మెట్రో ప్రారంభం నుంచి ఇప్పటివరకు తొమ్మిదేళ్లలో ప్రయాణ ట్రిప్పుల సంఖ్య వంద కోట్లకు చేరువైంది



హైదరాబాద్ నగర ప్రజారవాణా వ్యవస్థలో అత్యంత కీలకంగా మారిన మెట్రో రైలు పదో వసంతంలోకి అడుగుపెట్టింది. తొమ్మిదేళ్ల క్రితం 2017 నవంబర్ 28వ తేదీన హైదరాబాద్ మెట్రోను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, నాటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఆ తర్వాతి రోజు నుంచి మెట్రో రైలు సేవలు దశల వారీగా ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. ఈ తొమ్మిదేళ్ల కాలంలో మెట్రో రైలు ఎన్నో మైలురాళ్లను సాధించింది. మెట్రో రైలు రాకతో ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ సమస్యల నుంచి కొంతవరకు ఊరట లభించిందని చెప్పవచ్చు. సమయానికి గమ్యస్థానం చేరుతుండటంతో మిగిలిన రూట్లలోనూ త్వరగా మెట్రోను విస్తరించాలని నగరవాసులు కోరుతున్నారు. హైదరాబాద్ మెట్రోలో సగటున ప్రతిరోజూ నాలుగున్నర లక్షల మంది ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు తొమ్మిదేళ్ల కాలంలో ప్రయాణ ట్రిప్పుల సంఖ్య వంద కోట్లకు చేరుకుంది. మొత్తం 94.2 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించగా, సగటున ప్రతి రోజూ నాలుగున్నర లక్షల మంది ప్రయాణిస్తున్నారు. రోజుకు గరిష్ఠంగా 5 లక్షల 20 వేల వరకు చేరిన రోజులు ఉన్నాయి. నిత్యం ఎంతో మంది ప్రయాణికులను మెట్రో రైలు గమ్యస్థానానికి చేరుస్తుంది.ప్రభుత్వం ఇటీవల మెట్రో-ఆర్టీసీ కామన్‌పాస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఇందుకు నెలవారీ పాస్ రూ.4 వేలు, రోజువారీ రూ.275గా నిర్ణయించారు. మెట్రోను మరింత బలోపేతం చేసేందుకు కొత్తగా 60 కోచ్‌లు కొనుగోలు చేసేందుకు మన మెట్రో తరఫున టెండర్లను దిల్లీ మెట్రో రైలు కార్పొరేషన్ ఆహ్వానించింది.మెట్రో సుదీర్ఘ ప్రయాణంలో కొన్ని ఒడిదొడుకులు కూడా ఉన్నాయి. 2020 సంవత్సరంలో కొవిడ్‌తో 169 రోజులు లాక్‌డౌన్ కారణంగా మెట్రోకు తీవ్ర కుదుపు ఎదురైంది. అప్పట్లో రోజుకు 5 లక్షల మంది మెట్రో రైలులో ప్రయాణించేవారు. ఆరేళ్లలో ఆ సంఖ్యను ఇప్పటికీ చేరుకోలేకపోవడం గమనార్హం. మెట్రోలో ప్రస్తుతం 57 ట్రైన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.హైదరాబాద్ మెట్రోకు ఉన్న ఆస్తులు, నష్టాలను పరిగణనలోకి తీసుకుని రూ.22 వేల కోట్ల విలువ కట్టిన మెట్రో రైలు ఫేజ్-1 ప్రాజెక్ట్‌ను రూ.15 వేల కోట్లకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థతో ఏప్రిల్ 29న ఒప్పందం చేసుకుంది.కరెంట్‌తో నడిచే మెట్రో ద్వారా 629 మిలియన్ కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను ఆదా చేసింది.మొత్తం విద్యుత్తు వినియోగంలో 15 శాతం సోలార్ పవర్‌ను వినియోగిస్తోంది. మెట్రో డిపోలు, స్టేషన్లపై 12.4 మెగావాట్ల క్యాప్టివ్ సౌర విద్యుదుత్పత్తి జరుగుతోంది.మెట్రోలో రీజనరేటివ్ బ్రేకింగ్ అనే విధానం ద్వారా మెట్రో నడిపే విద్యుత్తు అవసరాల్లో 40 శాతాన్ని తిరిగి ఉత్పత్తి చేస్తోంది.మెట్రో ఆపరేషన్ ద్వారా లాభాల్లోనే ఉన్నప్పటికీ ప్రాజెక్ట్ నిర్మించేందుకు చేసిన అప్పులపై చెల్లిస్తున్న అధిక వడ్డీల కారణంగా మొత్తం ప్రాజెక్ట్ నష్టాల్లో కొనసాగుతోంది. తొమ్మిదేళ్ల కాలంలో నష్టాలు రూ.7 వేల కోట్లను దాటాయి. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి 6 నెలల్లోనే రూ.405 కోట్ల నష్టాలు వచ్చాయి. 100 శాతం వాటా స్వాధీనానికి ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నప్పటికీ ఐఆర్ఎఫ్‌సీ వద్ద రూ.13,600 కోట్ల రుణ మంజూరు ప్రక్రియ నిలిచిపోవడంతో ప్రతిష్టంభన నెలకొంది. డిసెంబర్ నెల నాటికి మెట్రో స్వాధీన ప్రక్రియ పూర్తి చేసి పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలనేది సర్కారు లక్ష్యం. రెండో దశలో 7 మార్గాల్లో 122.9 కిలోమీటర్లకు ప్రతిపాదించారు. కేంద్రం వద్ద రెండేళ్లుగా ఇవి పెండింగ్‌లో ఉన్నాయి.

ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం

అటవీ అధికారులను అభినందించిన పవన్ కల్యాణ్

కడప జిల్లాలో భారీగా ఎర్రచందనం పట్టివేత

114 దుంగలు, ఏడు వాహనాలు స్వాధీనం చేసుకున్న అధికారులు

అటవీశాఖ సిబ్బందిని అభినందించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

స్మగ్లింగ్ మార్గాలన్నీ మూసివేయాలని కఠిన ఆదేశాలు జారీ



ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకోవడంలో కీలక విజయం సాధించిన వైఎస్ఆర్ కడప జిల్లా అటవీశాఖ అధికారులను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అభినందించారు. భారీ ఎత్తున ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఆపరేషన్‌పై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.నిర్దిష్ట నిఘా సమాచారంతో అప్రమత్తమైన యాంటీ-రెడ్ శాండర్స్ టాస్క్‌ఫోర్స్, అటవీశాఖ ప్రత్యేక బృందాలు వైఎస్ఆర్ కడప ఫారెస్ట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. ఈ ఆపరేషన్‌లో సుమారు 114 ఎర్రచందనం దుంగలతో పాటు, రవాణాకు ఉపయోగిస్తున్న ఏడు వాహనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంబులెన్సులు, కార్లలో దుంగలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు అటవీశాఖ వెల్లడించింది. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా కడప జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌వో), ఆయన బృందాన్ని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. స్మగ్లర్లు అడవిలోకి ప్రవేశించడానికి కూడా భయపడేలా అక్రమ రవాణా మార్గాలన్నింటినీ మూసివేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. పరారీలో ఉన్న మిగతా నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని, ఈ స్మగ్లింగ్ నెట్‌వర్క్ వెనుక ఉన్న సూత్రధారులను పట్టుకునేందుకు సమగ్ర దర్యాప్తు జరపాలని సూచించారు. అటవీ సంపదను దోచుకునే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎర్రచందనం స్మగ్లింగ్ ముఠాలపై నిఘా పెంచి, దాడులను మరింత తీవ్రతరం చేయాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

అండాల అక్రమ రవాణా కేసులో వెలుగులోకి సంచలన విషయాలు

అండాల అక్రమ సేకరణ కేసులో దర్యాప్తు విస్తృతం

ప్రధాన నిందితుడి విచారణలో వెలుగులోకి కీలక ఆధారాలు

హైదరాబాద్‌లోని ఒయాసిస్ కార్పొరేట్ ఆఫీసులో పోలీసుల తనిఖీలు

వ్యవస్థీకృత ముఠాలు, ఫర్టిలిటీ కేంద్రాల పాత్రపై లోతుగా విచారణ

నకిలీ పత్రాలు, ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించిన పోలీసులు



నగరంలో సంచలనం సృష్టించిన అండాల అక్రమ సేకరణ కేసు దర్యాప్తులో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇది కేవలం కొందరి వ్యక్తిగత వ్యవహారం కాదని, దీని వెనుక వ్యవస్థీకృత ముఠాలు, పలు ఫర్టిలిటీ కేంద్రాల ప్రమేయం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో దర్యాప్తును అన్ని కోణాల్లో విస్తృతం చేశారు. పేద మహిళలను లక్ష్యంగా చేసుకుని, డబ్బు ఆశ చూపి, వారిని ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలించి అండాలను సేకరిస్తున్నారనే ఆరోపణలపై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు.ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన నిందితుడు ఎమిరిశెట్టి దుర్గాప్రసాద్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించగా, కీలక సమాచారం లభించినట్లు తెలుస్తోంది. మరిన్ని వివరాలు రాబట్టేందుకు అతడిని అదనపు కస్టడీకి తీసుకున్నామని పోలీసులు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలను ఫర్టిలిటీ కేంద్రాలు, ఏఆర్టీ బ్యాంకులకు పరిచయం చేయడంలో దుర్గాప్రసాద్ పాత్ర ఎంతవరకు ఉంది అతడికి గల పరిచయాలు, ఆర్థిక లావాదేవీలు, ఈ దందాలో భాగస్వాములైన ఇతర సహచరుల వివరాలపై పోలీసులు ప్రధానంగా దృష్టి సారించారు.విచారణలో భాగంగా పోలీసులు హైదరాబాద్‌లోని ఒయాసిస్ హాస్పిటల్స్ కార్పొరేట్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో ల్యాప్‌టాప్‌లు, ఇతర డిజిటల్ పరికరాలతో పాటు, డోనర్లకు సంబంధించిన రికార్డులు, ఆర్థిక లావాదేవీల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆధారాలను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపించి, సాంకేతిక ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.మహిళలను నియమించుకోవడానికి, వారిని ఫర్టిలిటీ కేంద్రాలకు పరిచయం చేయడానికి వ్యవస్థీకృత కమిషన్ విధానం ఏమైనా అమల్లో ఉందా ఈ వ్యవహారంలో ఫర్టిలిటీ కేంద్రాల డైరెక్టర్లు, కోఆర్డినేటర్లు, ఏజెంట్ల పాత్ర ఏమిటి అనే కోణాల్లోనూ దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో నకిలీ పత్రాలను సృష్టించి, చట్టాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలపైనా పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు.

కుమారుడిని కాపాడబోయి తల్లిదండ్రుల దుర్మరణం

రైలు కింద పడి ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి

ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్తున్న కుమారుడిని కాపాడే క్రమంలో కన్న తల్లిదండ్రులు సైతం ప్రాణాలు కోల్పోయారు

ఈ ఘటన పార్వతీపురంమన్యం జిల్లాలో చోటు చేసుకుంది



ఆర్థిక సమస్యలు తాళలేక ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్తున్న కుమారుడిని కాపాడేందుకు వెళ్లిన తల్లితండ్రితో కలిసి రైలు కిందపడి ముగ్గురు మృతి చెందిన ఘటన పార్వతీపురం మన్యం జిల్లాలో చోటు చేసుకుంది. గూడ్స్ రైలు ఢీకొట్టడంతో తల్లిదండ్రులు, కుమారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.రైల్వే పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన చల్లపల్లి శ్రీను (56), సింహాచలం (51) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో చిన్న కుమారుడు రాజేశ్ (28) గంట్యాడ మండలం లక్కిడాం గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శ్రీను లాండ్రీ బండి నడుపుతూ జీవనం సాగిస్తుండగా, గత ఆరు నెలలుగా ఈ దంపతులు తమ చిన్న కుమారుడు రాజేశ్‌తో కలిసి విజయనగరంలో నివాసముంటున్నారు.అయితే రాజేశ్ ఇటీవల పలువురి వద్ద అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురైన అతను ఆర్.వెంకంపేట రైల్వే గేటు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు పట్టాలపైకి వెళ్లాడు. ఈ విషయం గమనించిన తల్లిదండ్రులు శ్రీను, సింహాచలం అతన్ని వారించి కాపాడేందుకు పట్టాలపైకి పరుగెత్తారు. ఇదే సమయంలో వేగంగా వచ్చిన గూడ్స్ రైలు ముగ్గురినీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తల్లిదండ్రులు, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.జీవితం అంటే ఏదో ఒక సందర్భంలో సమస్యలు రావడం సహజం. వాటిని సరైన క్రమంలో ఎదుర్కొంటే పరిష్కార మార్గాలు తప్పకుండా దొరుకుతాయని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. మీకు ఆత్మహత్యకు సంబంధించిన ఆలోచనలు వస్తే, ఉద్యోగ రీత్యా తీవ్ర ఒత్తిడిలో ఉన్నా, సమస్యను ఎవరితోనైనా పంచుకోవాలని అనిపించినా, మీకు సహకరించేందుకు హెల్ప్‌లైన్ సెంటర్లు ఉన్నాయి. అందుకోసం టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ హెల్ప్‌లైన్ - 9152987821, స్నేహ ఫౌండేషన్ - 04424640050 (24ఇ7 అందుబాటులో ఉంటుంది) నంబరును సంప్రదించవచ్చు. వీరు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 8 నుంచి రాత్రి 10 వరకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తారు. మీ సమస్యను వారితో పంచుకుని పరిష్కారం పొందొచ్చు.

మడకశిర సరిహద్దులోఘోర రోడ్డు ప్రమాదం

ముగ్గురు మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

శ్రీసత్యసాయి జిల్లా మడకశిర సరిహద్దున ఉన్న కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా కనుమపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది



ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు

శ్రీసత్యసాయి జిల్లా మడకశిర సరిహద్దున ఉన్న కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా కనుమపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఈ దుర్ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మడకశిర మండలానికి చెందిన మేగేష్, శ్రీనివాసులు, నరసింహమూర్తి కర్ణాటకలో కూలీ పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై తమ స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో కనుమపల్లి వద్దకు రాగానే ఎదురుగా వేగంగా వచ్చిన ఓ కారు వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో బైక్‌పై ఉన్న మేగేష్, శ్రీనివాసులు, నరసింహమూర్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పావగడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. గాయపడిన వారు కూడా మడకశిర నియోజకవర్గానికి చెందినవారేనని పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగులకు గుడ్ న్యూస్ కొత్త పథకంతో వేలాది ఉద్యోగాలు..!

నిరుద్యోగుల కోసం కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి విదేశీ ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకానికి సంబంధించి మార్గదర్శకాల్ని కూడా విడుదల చేసింది. ఇందుకు సంబంధించి జీవో నంబర్ 19 జారీ చేసింది. ఈ పథకం ద్వారా విదేశాల్లో నైపుణ్యం కలిగిన కార్మికులకు, వృత్తి విద్య పూర్తి చేసిన వారికి వివిధ రంగాల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. అవగాహన లేకపోవడం, అవసరమైన నైపుణ్యాలు లేకపోవడం, విదేశాలకు వెళ్లేందుకు ఎక్కువ ఖర్చు కావడంతో పేద కుటుంబాలకు చెందిన యువతకు ఇబ్బందిగా మారింది. విదేశీ భాషల్లో శిక్షణ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్యాల పెంపు, ఉద్యోగాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు టామ్‌కామ్ సహకరిస్తుంది. సురక్షితంగా, చట్టబద్ధంగా విదేశాల్లో ఉద్యోగాల్లో చేరేందుకు అవకాశం లభించనుంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 7 వేల మందికి ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. నేరుగా విదేశాల్లో ఉద్యోగాలకు వెళ్లే 5,880 మందికి, విదేశీ భాషల్లో ప్రావీణ్యం అవసరమైన ఉద్యోగాలకు వెళ్లే 1,120 మందికి ఆర్థిక సాయం అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. విదేశీ ఉద్యోగాలకు వెళ్లే అభ్యర్థులను రెండు కేటగిరీలుగా విభజించారు. ూశ్రీంశీ =ముఎ ూూూా షాక్: ూ×తో 10,000 ఉద్యోగాలు గల్లంతు? మీ భవిష్యత్తు ఏంటి? విదేశీ భాషల్లో ప్రత్యేక శిక్షణ, పరీక్షలు అవసరం లేకుండా నేరుగా ఉద్యోగాలకు వెళ్లే వారిని మొదటి కేటగిరీలో చేర్చారు. వీరికి వీసా, విమాన ప్రయాణ ఖర్చుల నిమిత్తం గరిష్ఠంగా రూ.లక్ష వరకు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. అందులో 50 శాతం.. గరిష్ఠంగా రూ.50 వేల వరకు ప్రభుత్వం సబ్సిడీ అందించనుంది. ఆయా దేశాల భాషల్లో ప్రావీణ్యం అవసరమైన ఉద్యోగాలకు వెళ్లే వారిని రెండో కేటగిరీగా విభజించారు. ఈ కేటగిరీలో గరిష్ఠంగా రూ.3.50 లక్షల వరకు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. అందులో 50 శాతం.. గరిష్ఠంగా రూ.1.75 లక్షల వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వనున్నారు. రెండు కేటగిరీల్లోనూ మిగతా 50 శాతం ఖర్చును అభ్యర్థులు భరించాల్సి ఉంటుంది. సొంతంగా డబ్బు సమకూర్చుకోలేని వారికి బ్యాంకుల ద్వారా రుణాలు అందించే ఏర్పాట్లు చేస్తారు. ఇందుకు ప్రత్యేక రుణ విధానాన్ని రూపొందించేందుకు టామ్‌కామ్ జాతీయ బ్యాంకులతో చర్చనుంది. నిర్మాణ రంగం, మౌలిక సదుపాయాలు, తయారీ పరిశ్రమలు, ఆటోమొబైల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, రవాణా, లాజిస్టిక్స్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, వైద్య సహాయక సేవలు, హోటళ్లు, పర్యాటకం, మరమ్మతులు, నిర్వహణ, గృహ, వ్యక్తిగత సేవల రంగాల్లో ఉద్యోగాలకు ఈ పథకం వర్తించనుంది. అభ్యర్థుల వయసు 18 నుంచి 40 ఏండ్ల మధ్య ఉండాలి. సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన ఈడబ్ల్యూఎస్ ఆదాయ పరిమితికి లోబడి ఉన్న నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సంబంధిత వృత్తిలో కనీసం రెండేండ్ల పని అనుభవం ఉండాలి. ఆయా దేశాల వర్క్ వీసా నిబంధనలను బట్టి పని అనుభవం విషయంలో మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే నాటికి పాస్‌పోర్టు గడువు కనీసం ఆరు నెలలు ఉండాలి. ఉద్యోగ సంస్థలు నిర్దేశించిన వైద్య పరీక్షల్లో అర్హత సాధించాల్సి ఉంటుంది. బ్యాంకు ఖాతాల్లో రూ.2 వేలు జమ..! డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.



విదేశాల నుంచి టన్నుల కొద్దీ బంగారం ఇండియాకు



ఆర్బీఐ ఈ పసిడిని రహస్యంగా ఎక్కడ దాచిపెడుతోందంటే.. అంతర్జాతీయంగా తీవ్రమవుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధాల భయాలు, గ్లోబల్ ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక తన బంగారు నిల్వలను విదేశాల నుండి స్వదేశానికి తరలించే వ్యూహాత్మక ప్రక్రియను మరింత వేగవంతం చేసింది. సెప్టెంబర్ 2026తో ముగిసిన ఆరు నెలల కాలంలోనే ఆర్‌బిఐ దాదాపు 60 టన్నుల బంగారాన్ని విదేశీ ఖజానాల నుండి అత్యంత రహస్యంగా, కట్టుదిట్టమైన భద్రత నడుమ భారతదేశానికి తీసుకువచ్చింది. ఈ తాజా తరలింపుతో రిజర్వ్ బ్యాంక్ మొత్తం బంగారు నిల్వలలో స్వదేశంలో ఉన్న బంగారం వాటా ఏకంగా 84 శాతానికి చేరుకోవడం ఆర్థిక వర్గాలలో చర్చనీయాంశమైంది. తాజా గణాంకాల ప్రకారం, ఆర్‌బిఐ వద్ద ప్రస్తుతం మొత్తం 880.5 టన్నుల బంగారు నిల్వలు ఉండగా.. ఇందులో 740.13 టన్నులు భారతదేశంలోనే నిల్వ ఉన్నాయి. మిగిలిన 140.4 టన్నుల బంగారం (మొత్తం నిల్వలలో సుమారు 16 శాతం) లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌లో ఉన్న బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ వంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కస్టోడియన్ల సంరక్షణలో ఉంది. అంతర్జాతీయ బులియన్ మార్కెట్లలో తక్షణ ఆర్థిక లావాదేవీలు జరపడానికి.. స్వాప్ ఒప్పందాలకు, విదేశీ మారక నిల్వల నిర్వహణలో సౌలభ్యం కోసం కొంత భాగాన్ని విదేశాలలో ఉంచడం ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు అనుసరించే సాధారణ విధానమే అని చెప్పుకోవచ్చు. బంగారం ధరలు పెరిగాయి .. పసిడి రేటు ఈ రోజు ఎంత పైకి వెళ్లిందంటే.. నవంబర్ 26, గురువారం ధరలు ఇవే.. స్వదేశానికి తరలించిన బంగారాన్ని.. ఆర్‌బిఐ ప్రధానంగా ముంబై, నాగ్‌పూర్ నగరాలలోని అత్యంత భద్రత గల భూగర్భ ఖజానాలలో భద్రపరుస్తోంది. ఆర్‌బిఐ ప్రధాన కార్యాలయం ఉన్న ముంబైతో పాటు దేశ భౌగోళిక మధ్యభాగంలో ఉండి వ్యూహాత్మకంగా అత్యంత సురక్షితమైన నాగ్‌పూర్ ఖజానాలలో కఠినమైన ఆడిట్ నిబంధనలు, బయోమెట్రిక్ పరిమిత ప్రవేశం, బహుళ అంచెల భద్రతా ప్రమాణాల నడుమ ఈ నిల్వలను నిర్వహిస్తున్నారు. జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా ఈ ఖజానాల ఖచ్చితమైన స్థానాలు, రవాణా మార్గాలు, భద్రతా ఏర్పాట్లను కేంద్ర బ్యాంక్ పూర్తిగా గోప్యంగా ఉంచుతుంది. ఇంత భారీ పరిమాణంలో బంగారాన్ని విమానాల ద్వారా సురక్షితంగా తరలించడానికి ప్రత్యేక రవాణా విమానాలు, అత్యున్నత స్థాయి భద్రతా సిబ్బంది సమన్వయంతో పనిచేశారు. ఇటీవలి కాలంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత పాశ్చాత్య దేశాలు రష్యా విదేశీ మారక, బంగారు నిల్వలను స్తంభింపజేయడం ప్రపంచవ్యాప్తంగా అనేక కేంద్ర బ్యాంకులకు ఒక హెచ్చరికగా మారింది. అదనంగా అమెరికా వాణిజ్య సుంకాల హెచ్చరికలు, డాలర్ ఆధిపత్యంపై పెరుగుతున్న చర్చల నేపథ్యంలో ప్రపంచ కేంద్ర బ్యాంకులు తమ బంగారు నిల్వలను స్వదేశీ ఖజానాలలోనే ఉంచుకోవడానికి మొగ్గు చూపుతున్నాయి. విదేశీ కస్టోడియన్లపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం, నిల్వల భద్రతను వైవిధ్యపరచడం, అంతర్జాతీయ సంక్షోభాలు, కరెన్సీ అస్థిరత సమయాల్లో విలువైన జాతీయ ఆస్తులపై సంపూర్ణ సార్వభౌమ నియంత్రణ కలిగి ఉండటమే లక్ష్యంగా రిజర్వ్ బ్యాంక్ ఈ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇటీవల అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలలో తీవ్ర ఒడిదుడుకులు నెలకొన్నప్పటికీ.. దీర్ఘకాలిక ఆర్థిక భద్రత దృష్ట్యా భారత్ విదేశీ మారక నిల్వలలో బంగారం అత్యంత కీలక రక్షణ కవచంగా కొనసాగుతోంది.

మరో 6 నెలల్లో బంగారం ధర రూ.2.40 లక్షలకు

అసలు విషయం పసిడి

కాదంటున్న ప్రముఖ ఆర్థికవేత్త



అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉందన్న ఆందోళనలు అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్లలో నెలకొన్న వేళ, ప్రముఖ ఆర్థికవేత్త, ఫైనాన్షియల్ వ్యాఖ్యాత అలస్టైర్ మాక్లియోడ్ బంగారం ధరలు, అమెరికన్ డాలర్ భవిష్యత్తుపై సంచలన అంచనాలను వెలువరించారు. రాబోయే ఆరు నెలల్లోనే బంగారం ధర ఔన్సుకు 8,000 డాలర్లకు (భారత కరెన్సీలో 10 గ్రాములకు సుమారు రూ. 2,40,000) చేరుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. టాప్ ఆఫ్ మైన్ పాడ్‌కాస్ట్‌లో దేవన్ మురుగన్‌తో మాట్లాడుతూ.. బంగారం ధర ఈ స్థాయికి చేరడం అంటే పసుపు లోహం విలువ అమాంతం పెరిగిపోయినట్లు కాదని, అమెరికన్ డాలర్ కొనుగోలు శక్తి తీవ్రంగా పడిపోయిందని అర్థమని మాక్లియోడ్ విశ్లేషించారు. అందరూ విస్మరిస్తున్న అసలు వాస్తవం ఇదేనని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత మారకపు విలువ (డాలర్‌కు రూ. 92.97) ప్రకారం లెక్కిస్తే.. ఒక ట్రాయ్ ఔన్స్ (31.1035 గ్రాములు) 8,000 డాలర్లకు చేరితే సుమారు రూ. 7,43,760 అవుతుందని.. తద్వారా ఒక గ్రాము బంగారం ధర రూ. 23,912.42గాను, 10 గ్రాముల ధర దాదాపు రూ. 2,39,124గాను నమోదవుతుందని గణాంకాలు సూచిస్తున్నాయి. స్థ పెట్టుబడిదారులు బంగారాన్ని చూసే కోణాన్ని మార్చుకోవాలని.. అస్థిర ఆర్థిక పరిస్థితులలో భౌతిక బంగారాన్ని కలిగి ఉండటం అత్యంత కీలకమని మాక్లియోడ్ హితవు పలికారు. ప్రస్తుతం ప్రపంచం అనుసరిస్తున్న కీనేసియన్ (ఖఎఅవంఱుఅ) ఆర్థిక విధానాలలో వడ్డీ రేట్లు పెరిగితే అవకాశ వ్యయం పెరుగుతుందన్న సాకుతో బంగారాన్ని విక్రయించడం పరిపాటిగా మారిందని, ఇది బంగారం అసలు స్వభావాన్ని పూర్తిగా తప్పుగా అర్థం చేసుకోవడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.బంగారం ధరలు పెరిగాయి .. పసిడి రేటు ఈ రోజు ఎలా ఉందంటే.. నవంబర్ 27, శుక్రవారం ధరలు ఇవే.. అమెరికన్ల పొదుపు ఖాతాలలో బంగారం వాటా అత్యల్పంగా ఉన్న ప్రస్తుత తరుణంలో.. ఈక్విటీ మార్కెట్లు ఒక అసౌకర్యకరమైన బేర్ మార్కెట్ దిశగా కదులుతున్నాయని హెచ్చరించారు. మార్కెట్లో ద్రవ్య లభ్యత తగ్గిపోతే నగదు సమీకరించుకునేందుకు మదుపర్లు విచక్షణారహితంగా ఆస్తులను అమ్మే ప్రమాదం ఉందని పేర్కొంటూ.. అసలు ముప్పు రుణ వ్యవస్థలోనే దాగి ఉందని, అందువల్ల క్రెడిట్ ఆధారిత ఆస్తుల నుండి బయటకు వచ్చి భౌతిక బంగారంలోకి మళ్లడమే శ్రేయస్కరమని మదుపర్లకు సూచించారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఎదుర్కొంటున్న విధానపరమైన గందరగోళాన్ని కూడా మాక్లియోడ్ ఎత్తిచూపారు. వడ్డీ రేట్ల నిర్ణయాల విషయంలో డాలర్ విలువను కాపాడుకోవాలా లేక కుప్పకూలకుండా ఆర్థిక వ్యవస్థను.. ఆర్థిక మార్కెట్లను రక్షించుకోవాలా అనే క్లిష్ట పరిస్థితి ఫెడ్ ముందుందని, చివరికి డాలర్ కంటే ఆర్థిక వ్యవస్థను కాపాడటానికే ఫెడ్ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన అంచనా వేశారు. ద్రవ్య లభ్యత ఒత్తిడిని తగ్గించేందుకు ఫెడ్ జోక్యం చేసుకున్నప్పుడల్లా డాలర్‌పై ప్రపంచానికి ఉన్న నమ్మకం మరింత సడలుతుందని.. తమ కరెన్సీ విలువ పడిపోతోందని వినియోగదారులు పూర్తిగా గ్రహించిన రోజు ఆ కరెన్సీ ఆధిపత్యం ముగిసినట్లేనని ఆయన వ్యాఖ్యానించారు. ఇక తాజా మార్కెట్ గణాంకాలను పరిశీలిస్తే.. అమెరికా కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో బంగారం ధర మునుపటి 3,535.80 డాలర్ల నుండి 3.99 శాతం ఎగబాకి ఔన్సుకు 3,677 డాలర్ల వద్ద కదలాడుతుండగా.. వెండి ధర ఔన్సుకు 44.18 డాలర్లుగా నమోదైంది. మరోవైపు నవంబర్ 25న విడుదలైన గణాంకాల ప్రకారం.. అక్టోబర్ నెలలో అమెరికా 'పర్సనల్ కన్సంప్షన్ ఎక్స్‌పెండిచర్స్' ద్రవ్యోల్బణం వార్షిక ప్రాతిపదికన 3.8 శాతానికి, కోర్ ద్రాజు నవంబర్ 2023 తర్వాత గరిష్ఠ స్థాయి అయిన 3.3 శాతానికి చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. మొండిగా కొనసాగుతున్న ఈ ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు డిసెంబర్ 8-9 తేదీలలో జరగనున్న సమావేశంలో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు పెంచి.. ఫెడరల్ ఫండ్స్ లక్షిత శ్రేణిని 3.75-4 శాతం నుండి 4-4.25 శాతానికి చేర్చే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

డేటా సెంటర్లతో ఉద్యోగాలు రావా

రూ.లక్షల కోట్లు గంగ పాలేనా



భారత్ డేటా సెంటర్ ప్లాన్‌పై జేపీ మోర్గాన్ ఆందోళన భారీ స్థాయిలో డేటా సెంటర్ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాయితీలు, పన్ను ప్రోత్సాహకాలు అందించే విషయంలో భారతదేశం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ప్రముఖ అంతర్జాతీయ ఆర్థిక సంస్థ జేపీమోర్గాన్ ఆర్థికవేత్తలు సాజిద్ చినోయ్, సిద్ధార్థ్ జవాద్ హెచ్చరించారు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ప్రచురితమైన 'మైండ్ ది డేటా సెంటర్ ట్రాప్' అనే విశ్లేషణాత్మక వ్యాసంలో.. కేవలం మౌలిక సదుపాయాలైన డేటా సెంటర్లకే పరిమితం కాకుండా కృత్రిమ మేధస్సు ఎకోసిస్టమ్‌లోని అధిక విలువ ఆధారిత విభాగాలపై విధాన రూపకర్తలు దృష్టి సారించాలని వారు స్పష్టం చేశారు.డేటా సెంటర్ల నిర్మాణానికి అపారమైన మూలధనం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు అవసరమైనప్పటికీ, నిర్మాణం పూర్తయిన తర్వాత అవి సృష్టించే దీర్ఘకాలిక ఉద్యోగాలు అత్యంత పరిమితంగా ఉంటాయని ఆర్థికవేత్తలు ఎత్తిచూపారు. కొలంబియా బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్ బ్రిజ్న్ వాన్ న్యూవర్‌బర్గ్ పరిశోధనను ఉదహరిస్తూ.. ఒక 200-మెగావాట్ల డేటా సెంటర్‌లో 8 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడితే గరిష్ఠంగా 150 శాశ్వత ఉద్యోగాలు మాత్రమే లభిస్తాయని పేర్కొన్నారు. అదే స్థాయి పెట్టుబడిని భారతదేశంలోని ఇతర ఉత్పాదక రంగాలలో పెడితే దాదాపు 4,00,000 ఉద్యోగాలను సృష్టించవచ్చని, కాబట్టి డేటా సెంటర్ల వైపు భారీ నిధులను మళ్లించడం వల్ల కలిగే అవకాశ వ్యయం చాలా ఎక్కువని వారు విశ్లేషించారు. ూశ్రీంశీ =ముఎ మనుషులు ఇక అవసరం లేదు.. రోబోలే ప్రపంచాన్ని నడిపిస్తాయి..పై బిల్ గేట్స్ సంచలన హెచ్చరిక.. దీనికి తోడు డేటా సెంటర్లలో వచ్చే విదేశీ పెట్టుబడుల వల్ల దేశీయ ఆర్థిక వ్యవస్థకు చేకూరే నికర ప్రయోజనాలపైనా చినోయ్, జవాద్ పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఒక డేటా సెంటర్ ప్రాజెక్టులో పెట్టే మొత్తం పెట్టుబడిలో సుమారు 70 శాతం విదేశాల నుండి దిగుమతి చేసుకునే ఖరీదైన సర్వర్లు, చిప్‌లు, సాంకేతిక పరికరాలపైనే ఖర్చవుతుందని, దీనివల్ల దేశీయంగా విలువ సృష్టి నామమాత్రంగానే ఉంటుందని వివరించారు. పైగా అత్యధిక డేటా సెంటర్లు అంతర్జాతీయ హైపర్‌స్కేలర్ దిగ్గజాల యాజమాన్యంలో ఉండటం వల్ల భవిష్యత్తులో వాటి లాభాలు తిరిగి విదేశాలకే తరలిపోతాయని, తద్వారా రాయితీ భూములు మరియు పన్ను మినహాయింపులు ఇచ్చినా దీర్ఘకాలంలో భారతదేశ చెల్లింపుల శేషం గణనీయంగా మెరుగుపడదని అభిప్రాయపడ్డారు. ఆర్థిక అంశాలకు అతీతంగా పర్యావరణ, మౌలిక సదుపాయాల సవాళ్లను కూడా వారు ప్రస్తావించారు. భారీ డేటా సెంటర్ల నిర్వహణకు అపరిమితమైన విద్యుత్, నీటి వనరులు అవసరమవుతాయని, ఇది స్థానిక ప్రజలు, పరిశ్రమలకు సంబంధించిన మౌలిక సదుపాయాలపై తీవ్ర ఒత్తిడిని పెంచుతుందని.. ఇదే కారణంతో అమెరికాలోనూ పెద్ద డేటా సెంటర్ ప్రాజెక్టులపై ప్రజల నుండి వ్యతిరేకత వ్యక్తమవుతోందని గుర్తుచేశారు. అందువల్ల సబ్సిడీల పోటీతో డేటా సెంటర్లను ఆకర్షించడానికి బదులుగా..ఏఐ అప్లికేషన్లు, ఫ్రాంటియర్ ఏఐ మోడల్స్ (అత్యాధునిక నమూనాలు), భారతీయ భాషల కోసం రూపొందించే స్వదేశీ సాంకేతికతలలో పెట్టుబడులు పెట్టడం ద్వారానే భారత్‌కు విస్తృత ఉపాధి, మేధో సంపత్తి, దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనాలు దక్కుతాయని జేపీమోర్గాన్ ఆర్థికవేత్తలు సిఫార్సు చేశారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

హైదరాబాద్‌లో ఏడాదికి రూ. 2.22 కోట్లు అద్దె

రిటైల్ స్టోర్ కోసం ఆపిల్ భారీ ఆస్తి ఒప్పందం



టెక్ దిగ్గజం ఆపిల్ భారతదేశంలో తన ప్రత్యక్ష రిటైల్ ఉనికిని మరింత విస్తరిస్తూ భాగ్యనగరంలో అడుగుపెట్టేందుకు సర్వం సిద్ధం చేసుకుంది. దేశంలో తన ఏడవ అధికారిక రిటైల్ స్టోర్‌ను హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉన్న లేక్ షోర్ మాల్ లో డిసెంబర్ 10, 2026 నాడు ప్రారంభించనున్నట్లు వెల్లడైంది. రియల్ ఎస్టేట్ డేటా అనలిటిక్స్ సంస్థ 'ప్రాప్‌స్టాక్' సేకరించిన ఆస్తి రిజిస్ట్రేషన్ పత్రాల ప్రకారం.. ఆపిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సుమారు 11,890 చదరపు అడుగుల విస్తీర్ణం గల రిటైల్ స్థలం కోసం కూకట్‌పల్లి డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో దీర్ఘకాలిక లీజు ఒప్పందాన్ని కుదుర్చుకుంది. లేక్ షోర్ మాల్‌లోని లోయర్ గ్రౌండ్, గ్రౌండ్ ఫ్లోర్‌లలో ఈ ప్రతిష్ఠాత్మక అవుట్‌లెట్ ఏర్పాటు కానుంది. ఈ రిటైల్ స్థలానికి సంబంధించిన లీజు ఒప్పంద నిబంధనలు ఆసక్తికరంగా ఉన్నాయి. మొత్తం 10 సంవత్సరాల 9 నెలల కాలానికి వర్తించే ఈ ఒప్పందాన్ని మరో ఐదేళ్లపాటు పొడిగించుకునే వెసులుబాటును ఆపిల్ పొందింది. ఏప్రిల్ 15, 2026 నుండి అమల్లోకి వచ్చిన ఈ లీజు కింద ఆపిల్ నెలకు కనీసం రూ. 18.50 లక్షలు (సంవత్సరానికి సుమారు రూ. 2.22 కోట్లు) అద్దె చెల్లించనుంది. అంటే నెలకు చదరపు అడుగుకు రూ. 155.50 లేదా స్టోర్ నికర ఆదాయంలో 2 శాతం చొప్పున, ఈ రెండింటిలో ఏది ఎక్కువైతే అది చెల్లించాల్సి ఉంటుంది. ూశ్రీంశీ =ముఎ ఆపిల్ పే ఇండియాలో లాంచ్ అయినా పెద్ద బ్యాంకులు ఎందుకు చేరలేదు.. అసలు కారణం ఇదే.. ఒప్పందం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు కనీస అద్దె 15 శాతం చొప్పున పెరుగుతుంది. అలాగే 37వ నెల నుండి ఆదాయ భాగస్వామ్య రేటు 2.5 శాతానికి చేరుతుంది. అయితే ఆదాయ భాగస్వామ్యంతో కలిపి మొత్తం అద్దె ఆయా సమయాల్లో వర్తించే కనీస అద్దెకు రెట్టింపు మించకుండా గరిష్ఠ పరిమితిని విధించారు. ఇంటీరియర్ పనుల కోసం తొమ్మిది నెలల అద్దె రహిత కాలాన్ని కేటాయించగా, ఆపిల్ ఇప్పటికే రూ. 1.11 కోట్ల సెక్యూరిటీ డిపాజిట్‌ను చెల్లించింది; జనవరి 15, 2027 లేదా స్టోర్ వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమైన తేదీలలో ఏది ముందు అయితే అప్పటి నుండి అద్దె చెల్లింపులు మొదలవుతాయి. కూకట్‌పల్లిలోని ఈ కొత్త అవుట్‌లెట్ ద్వారా హైదరాబాద్ వినియోగదారులకు ఆపిల్ ప్రపంచ స్థాయి రిటైల్ అనుభూతి అందుబాటులోకి రానుంది. ఇక్కడ తాజా ఐఫోన్‌లు, మ్యాక్‌బుక్‌లు, ఐప్యాడ్‌లు, ఆపిల్ వాచ్‌లు, ఎయిర్‌పాడ్‌లతో పాటు విస్తృత శ్రేణి యాక్సెసరీలను కొనుగోలు చేయవచ్చు. అంతేకాకుండా వినియోగదారులకు వ్యక్తిగత సహాయం అందించేందుకు ఆపిల్ స్పెషలిస్టులు, క్రియేటివ్‌లు, సాంకేతిక పరిష్కారాల కోసం 'జీనియస్' నిపుణులు అందుబాటులో ఉంటారు. స్టోర్‌లో ప్రతిరోజూ ఉచితంగా నిర్వహించే 'టుడే ఎట్ ఆపిల్' సెషన్‌ల ద్వారా ఉత్పత్తుల వినియోగంతో పాటు ఫొటోగ్రఫీ, వీడియో మేకింగ్, డ్రాయింగ్ వంటి సృజనాత్మక నైపుణ్యాలను నేర్చుకునే అవకాశం కలుగుతుంది. భారతదేశంలో ఆపిల్ రిటైల్ ప్రస్థానం ఏప్రిల్ 2023లో ముంబైలోని ఆపిల్ బీకేసీ , ఢిల్లీలోని ఆపిల్ సాకేత్ ప్రారంభంతో మొదలైంది. ఆ తర్వాత బెంగళూరు, పూణే, నోయిడాలకు విస్తరించిన సంస్థ, ఫిబ్రవరి 2026లో ముంబైలోని బోరివాలిలో మరో అవుట్‌లెట్‌ను ప్రారంభించింది. ఇప్పుడు డిసెంబర్ 10న ప్రారంభం కానున్న హైదరాబాద్ స్టోర్ దేశంలో ఆపిల్‌కు ఏడవ రిటైల్ కేంద్రంగా నిలుస్తూ, దక్షిణ భారతదేశంలో కంపెనీ మార్కెట్ విస్తరణకు మరింత బలం చేకూర్చనుంది.

చిన్న ఉద్యోగం కోసం కిలో మీటర్ క్యూ

ఇది దేశంలోని నిరుద్యోగానికి నిదర్శనం..!



గత రెండు మూడేళ్లుగా నిరుద్యోగం పెరిగిపోతుంది. అప్పట్లో ఐటీ నియామకాలు భారీగా జరిగేవి. కానీ ఈ మధ్య తగ్గిపోయింది. సంవత్సరానికి లక్షల మంది గ్రాడ్యుయేట్ పూర్తి చేసుకోని బయటకు వస్తున్నారు. కానీ వారికి ఉద్యోగాలు దొరకడం లేదు. ఇందుకు తాజాగా వైరల్ అయిన ఓ వీడియో నిదర్శనం కానుంది. హైదరాబాద్‌లోని విప్రో బయట వాక్-ఇన్ ఇంటర్వ్యూ కోసం వందలాది మంది ఉద్యోగార్థులు క్యూలో నిలబడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియో దేశంలోని ఉద్యోగాలు, నిరుద్యోగం, విద్యా వ్యవస్థపై చర్చకు దారి తీసింది. ఈ వీడియోలో నిరుద్యోగులు రోడ్డు పక్కన, పార్క్ చేసిన వాహనాల చుట్టూ తిరిగి కంపెనీ గేటు వరకు క్యూ లైన్ లో నిల్చునున్నారు.హైదరాబాద్‌లోని విప్రో వాక్-ఇన్ ఇంటర్వ్యూకు మించి ఉద్యోగాలపై చర్చ కొనసాగుతోంది. ఇంజనీరింగ్, ఐటీ అత్యంత సురక్షితమైన వృత్తులు కాని చాలా మంది కామెంట్లు చేస్తున్నారు. సమాజంలో చాలా మంది వారి పిల్లలను ఇంజినీరింగ్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారన గుర్తు చేస్తున్నారు. బీ.టెక్ మాత్రమే చేయదగిన డిగ్రీ అని, సాఫ్ట్‌వేర్ మాత్రమే గౌరవప్రదమైన వృత్తి అని విద్యార్థులకు బోధిస్తున్నారని మరొకరు కామెంట్ చేశారు. కంపెనీలు ఇప్పటికీ ఈ విధ



'భోగి' మూవీ రివ్యూ అండ్ రేటింగ్

టైటిల్: భోగి

నటీనటులు: శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి, శరత్ లోహితశ్వ తదితరులు

నిర్మాణ సంస్థ:శ్రీ సత్యసాయి ఆర్ట్స్

నిర్మాత: కేకే రాధామోహన్

రచయిత, దర్శకత్వం: సంపత్ నంది

సంగీతం: భీమ్స్

సినిమాటోగ్రఫీ: కిషోర్ కుమార్

విడుదల తేది: నవంబర్ 27, 2026

కథేంటంటే..

1960ల కాలంలో తెలంగాణలోని 'బొగ్గుల గుట్ట'అనే ఫిక్షనల్ విలేజ్‌లో జరిగే కథ ఇది. ఆ ఊరి పటేల్(శరత్ లోహితశ??వ) చెప్పిందే వేదం అక్కడ. గ్రామానికి ఏ సమస్య వచ్చిన పటేల్ ఆదుకుంటాడని ఊరంతా నమ్ముతుంది. ఊరికి ఆపద వచ్చిన ప్రతిసారి పటేల్ పూజలు చేస్తుంటాడు. అదే ఊరిలో ఐదుగురు చెల్లెలతో కలిసి కమ్మరి వృత్తి చేస్తూ జీవితం గడుతుంటాడు గంగ(శర్వానంద్). పెద్ద చెల్లికి ఓ సంబంధం చూసి పెళ్లి కూడా ఫిక్స్ చేస్తాడు. అదే సమయంలో పటేల్ అప్పగించిన ఓ పని కోసం పాలెగాళ్లతో కలిసి అడవికి వెళ్తాడు. అక్కడ గంగకు ఓ భయంకరమైన నిజం తెలుస్తుంది. అదేంటి? ఊరంతా ముఖం చూడడానికే భయపడే పటేల్‌కి గంగ ఎందుకు ఎదురుతిరగాల్సి వచ్చింది? మూఢనమ్మకంతో పటేల్ చేస్తున్న అరాచకపు పని ఏంటి? అది గంగ కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేసింది? దాన్ని గంగ ఎలా అడ్డుకున్నాడు? ఈ కథలో

సులోచన(అనుపమ పరమేశ్వరన్), మందారం(డింపుల్ హయాతి) పాత్రలు ఏంటి? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

ఎలా ఉందంటే..

ఈ మధ్య సినిమాల్లో కథ కంటే కత్తులకే ఎక్కువ పని చెబుతున్నట్టుంది. ఎన్ని తలలు తెగితే అంత పెద్ద హిట్ అవుతుందన్న లెక్కలో దర్శకులు కొత్త కొత్త హింసాత్మక యాంగిల్స్‌ను వెతుకుతున్నారు. కానీ ప్రేక్షకుడిని కట్టిపడేసే కొత్త కథను చెప్పాలన్న ఆలోచన మాత్రం ఎక్కడో వెనుకబడిపోతోంది. ఆ మధ్య వచ్చిన 'ప్యారడైజ్'లో హింస ఏ స్థాయిలో ఉందో చూశాం. ఇప్పుడు 'భోగి'లో అంతకు మించి అన్నట్టుగా రక్తపాతాన్ని తెరపై ఆవిష్కరించారు.

నిజానికి హింసను కథలో భాగంగా, బలమైన భావోద్వేగాలతో ముడిపెట్టి చూపిస్తే ప్రేక్షకులు అంగీకరిస్తారు. కానీ ఎలాంటి ఎమోషన్ లేకుండా, కేవలం షాక్ ఇవ్వాలనే ఉద్దేశంతో హింసను ఇష్టానుసారంగా జొప్పిస్తే మాత్రం అది ప్రేక్షకులకు వినోదం కాకుండా ఒకరకమైన హింసగానే మారుతుంది. అందుకు 'భోగి' ఓ మంచి ఉదాహరణ అని చెప్పొచ్చు. మూఢనమ్మకాలు, గ్రామీణ ప్రాంతాల్లోని సామాజిక సమస్యలను కథాంశంగా తీసుకున్నా.. రక్తపాతం, హింసాత్మక సీన్లకే ఎక్కువ ప్రాధాన్య ఇవ్వడం.. స్క్రీన్‌ప్లే కూడా రొటీన్‌గా ఉండడంతో ఈ 'భోగి'మంటను భరించలేకపోతాం.

సినిమా ప్రారంభం ఆసక్తికరంగానే ఉంటుంది. బొగ్గుల గుట్ట గ్రామ నేపథ్యం, పటేల్‌కి ఇచ్చే ఎలివేషన్.. హీరో ఫ్యామిలీ నేపథ్యం..పాటలు.. ఇలా మొదటి అర గంట ఆసక్తికరంగానే ఉంటుంది. ఎప్పుడైతే హీరోకి పటేల్ చేసే అరాచకపు పని గురించి తెలుస్తుందో.. ఆ తర్వాత కథనం మొత్తం ఊహకందేలా సాగుతుంది. ఈ క్రమంలో వచ్చే ఎమోషనల్ సీన్లు కూడా సరిగా పండలేదు. ఇంటర్వెల్ సీన్‌తో ద్వితీయార్థం ఎలా ఉండబోతుందో ప్రేక్షకుడు అంచనా వేస్తాడు.

ఇక సెకండాఫ్‌లో హింస తప్ప ఇంకేమి ఉండదు. అవసరం లేని సన్నివేశాలు, అతిగా సాగదీసిన యాక్షన్ ఎపిసోడ్లు ప్రేక్షకుల సహనాన్ని పరీక్షగా మారుతాయి. ప్రీక్లైమాక్స్‌లో వచ్చే ఓ ట్విస్ట్ కాస్త సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. ఆ తర్వాత యాక్షన్ ఎపిసోడ్ మొత్తం రొటీన్‌గానే సా..గుతుంది. దర్శకుడు సంపత్ నంది ఓ మంచి పాయింట్ ఎంచుకున్నా.. దాన్ని ఆసక్తికరంగా మలచడంలో మాత్రం సఫలం కాలేదు.

ఎవరెలా చేశారంటే..

శర్వానంద్ తనదైన నటనతో ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా ఎమోషనల్ సన్నివేశాల్లోనూ, యాక్షన్ సీన్లలోనూ మంచి ప్రతిభ కనబరిచాడు.తెలంగాణ యాసను కూడా బాగానే పలికాడు. ఇక అనుపమ పరమేశ్వరన్ తన పాత్రకు న్యాయం చేసింది. ఆమెకు ఒకటి, రెండు బలమైన సీన్లు పడ్డాయి. డింపుల్ హయాతి పాత్ర నిడివి తక్కువే అయిన ఉన్నంతలో బాగానే చేసింది. ఇక ఊరి పటేల్‌గా శరత్ లోహితశ్వతో పాటు మిగిలిన నటీనటులు తమ పాత్రల పరిధిమేర బాగానే చేశారు. సాంకేతికంగా సినిమా పర్వాలేదు. ఈ సినిమాకు ప్రధాన బలం సినిమాటోగ్రఫీ. తెలంగాణ గ్రామీణ వాతావరణాన్ని తెరపై చక్కగా చూపించారు. చీకట్లో తెరకెక్కించిన సన్నివేశాలు బాగున్నాయి. భీమ్స్ అందించిన పాటలు బాగున్నాయి. తెలంగాణ సంస్కృతిని ప్రతిభించేలా పాటలు ఉంటాయి. కానీ నేపథ్య సంగీతం మాత్రం యావరేజ్. కొన్ని చోట్ల అతిగా అనిపిస్తుంది. ఎడిటర్ తన కత్తెరకు ఇంకాస్త పని చెప్పాల్సింది. ముఖ్యంగా సెకండాఫ్‌ని మరింత క్రిస్పీగా కట్ చేయల్సింది. నిర్మాణ విలువలు బాగున్నాయి.





పగలు కోర్టులో స్టెనోగ్రాఫర్, రాత్రి రొమాంటిక్ రచయిత..

యూట్యూబ్‌లో దూసుకుపోతున్న నితిన్ 'అలియాస్ రుక్మిణి' ట్రైలర్!

నేచురల్ స్టార్ నాని సమర్పణలో, యువ కథానాయకుడు నితిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'అలియాస్ రుక్మిణి' ట్రైలర్ యూట్యూబ్‌లో విడుదలై సినీ ప్రియుల నుంచి విశేష స్పందనను అందుకుంటోంది. ఇప్పటివరకు రొటీన్ కమర్షియల్ చిత్రాలతో అలరించిన నితిన్, ఈసారి తన పంథాను మార్చుకుని ఒక సరికొత్త, విభిన్నమైన కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో నితిన్ 'కృష్ణ' అనే యువకుడి పాత్రలో కనిపిస్తున్నారు. బయటి ప్రపంచానికి కళ్లద్దాలు పెట్టుకుని, ఫ్యామిలీ కోర్టులో పనిచేసే ఒక సాధారణ స్టెనోగ్రాఫర్‌లా ఎంతో అమాయకంగా, పద్ధతిగా కనిపించే కృష్ణ జీవితంలో ఎవరికీ తెలియని ఒక ఆసక్తికరమైన రహస్యం దాగి ఉంటుంది. రాత్రి సమయంలో అతను 'రుక్మిణి' అనే ఒక అమ్మాయి కలం పేరుతో రహస్యంగా శృంగార కథలు, రొమాంటిక్ నవలలు రాస్తుంటాడు. ఇంట్లో కుటుంబ సభ్యులు అతను ఆ పుస్తకాలను చదువుతున్నాడని కంగారు పడుతుంటే, అసలు వాటిని రాస్తున్నదే అతనని తెలిసే సన్నివేశాలు ట్రైలర్‌లో కడుపుబ్బా నవ్విస్తున్నాయి. 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించగా, యునానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దీప్తి గంటా నిర్మించారు. నితిన్, ఆఫియా సయ్యద్ జంటగా నటించిన ఈ సినిమాలో సాయి కుమార్, హర్షవర్ధన్ కీలక పాత్రలు పోషించారు.

రాముడిగా మహేష్ బాబు.. 'వారణాసి'లో రాజమౌళి ప్లాన్ మామూలుగా లేదుగా,అసలు ట్విస్ట్ ఇదే!



సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. పాన్ వరల్డ్ స్థాయిలో రూపొందుతున్న ఈ అడ్వెంచర్ థ్రిల్లర్ కోసం ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా ఈ సినిమాలో మహేష్ బాబు పోషిస్తున్న పాత్ర, ఆయన లుక్ ఎలా ఉండబోతున్నాయనే విషయాలు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా ఈ సినిమాలో మహేష్ బాబు శ్రీరాముడిగా కనిపించనున్నారనే అంశానికి సంబంధించి ఆసక్తికరమైన విషయాలు తెరపైకి వచ్చాయి. ఇప్పటికే బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ 'రామాయణ' చిత్రంలో శ్రీరాముడి పాత్రలో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఇప్పుడు మహేష్ బాబు కూడా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వారణాసి'లో రాముడి పాత్రలో కనిపించనున్నారనే వార్త అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. అయితే ఈ రెండు పాత్రల మధ్య చాలా వ్యత్యాసం ఉండబోతున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం 'వారణాసి' సినిమాలో మహేష్ బాబు శ్రీరాముడిగా కనిపించేది కొంత భాగంలో మాత్రమేనట. అంటే సినిమా మొత్తం ఆయన రాముడి పాత్రలో కనిపించరని తెలుస్తోంది. అయితే ఆ పాత్ర నిడివి తక్కువగా ఉన్నప్పటికీ కథలో మాత్రం చాలా కీలకమైన ప్రభావాన్ని చూపించనుందని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా కథలో వచ్చే కీలకమైన మలుపులకు ఈ పాత్రకు సంబంధం ఉండబోతుందని సమాచారం. ఈ సినిమాలో రాజమౌళి రాముడి పాత్రను డిజైన్ చేసిన విధానం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని టాక్.

PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THRIMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040